# సమర్థ సద్గురు


## ఆధ్యాత్మిక మాసపత్రిక



శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

**గూడూరి వెంకటరత్నం**

**డి.జె. బాలకృష్ణ లాల్**

**డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి**

**మిస్.పి. ఇందిరాదేవి**

**డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు**

**డా॥ యమ్.స్వర్ణముఖి**



Volume 30 Issue 4

No.of Pages 40

DECEMBER 2010

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో....** **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీ అభిభాషణ | 8 |
| సన్నిధిలో సంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 14 |
| శ్రీమాతాజీవారి నవరాత్రి సందేశాలు | 15 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 17 |
| శ్రీకృష్ణతత్వము, ప్రేమయోగము | 19 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 21 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 23 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 25 |
| సమర్థసద్గురు నాధుని దివ్యచరిత్ర | 27 |
| అమెరికాలో శ్రీ మాతాజీ | 29 |
| మారనిది ఏది? | 31 |
| మన సాధన ఎందుకు ఫలించటంలేదు? | 32 |
| గురుశిక్షణ | 34 |
| పునీతవతి | 35 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోzహం భావేన పూజయేత్**
**అభేద దర్శనం జ్ఞానం ధ్యానం నిర్విషయం మనః**
**స్నానం మనోమల త్యాగః శౌచ మింద్రియ నిగ్రహః**
**బ్రహ్మామృతం పిబేత్ భైక్ష్య మాచరే ద్దేహరక్షణే**

-స్కందోపనిషత్

బ్రతుకు ఎప్పుడు అంతమవుతుందో చెప్పలేము.అయితే,"బ్రతుకు ఎప్పుడు అంతమైనా ఏమిటి, అనే వైరాగ్యం వచ్చినప్పుడు సాధన పరిపూర్ణత చెందినట్లు,'' అన్న శ్రీమాతాజీవారి బోధని గుర్తుచేసుకుంటే ఆ స్థితి ఎప్పుడు పొందుతామా అనే భావన కలగటం సహజమే.

ఇంద్రియాలు మనస్సుకి జిడ్డు పట్టిస్తున్నాయి. దానిని వదిలించుకుంటే గాని మనస్సు నిర్విషయమవ్వదు. శమము, దమము, ధనముతో కొనలేము కదా! దానిని గురుమూర్తి అనుగ్రహముతోనే సాధించగల్గుతాము.

అభేద దృష్టి అంటే మహాత్ములు అందజేసిన దానిని మనస్సు పెట్టి మన హృదయంలో పదిలపరచుకోవాలి. ఆ స్థితిలో ఉన్న సాధకునికి ప్రపంచంలో ఏదైనా సత్యంగానే గోచరిస్తుంది.

"మనస్సు ఏకాగ్రత పొందితే నీకు తోడుగా నీ ప్రభువే అని గ్రహించగల్గుతావు. అప్పుడు ప్రభువు ప్రసాదించిన జ్ఞానమును 'నేను' మరియు 'మేను' మరచి అనుభవించగల్గుతావు'', అని నవరాత్రి మహోత్సవాలలో శ్రీమాతాజీ చేసిన హెచ్చరిక శాస్త్రవాక్యమే. శాస్త్ర వాక్యాన్ని గురుబోధతో అన్వయించుకొని పొందిన అనుభూతి జ్ఞానము కాక మరి ఏమిటి? *

# అమ్మ ఆశీస్సులు

**అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం ।**
**తత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవేనమః ॥**

అఖండమై, వర్తులాకారమై ఈ సమస్త చరాచర జగత్తు ఎవరిచేత వ్యాపింపబడినదో, అట్టి **'తత్'-** అది , ఆ పదము ఎవరిచేత చూపించబడినదో, అట్టి శ్రీ గురు పరమాత్మకు నమస్కారము - అని శ్రీ గురుగీత బోధిస్తున్నది.

'ఉన్నది' అని దేనిని మనమందరము సర్వకాలములలో ఏ స్థితిలో అనగలుగుతున్నామో, అది మారనిదై ఉన్నది. పరిణామము లేనిదై ఉన్నది. అఖండమైనది అదే! అనంతమైనది అదే! సర్వవ్యాపకమైనది అదే!ఆదిమధ్యాంత రహితమైనది అదే! - అనే సత్యాన్ని శ్రీ గురుదేవులు తమ బోధామృతంలో అహర్నిశలు భక్తులకు అందిస్తున్నారు.

**కేవలం సత్యరూపోzహం జయ జయ రామా। కేవలం శాశ్వతోzస్మ్యహం జయ జయ రామా। కేవలం చిన్మయోస్మ్యzహం జయ జయ రామా ।కేవలం పరమోzస్మ్యహం జయ జయ రామా। అహం త్యక్త్వాzహమస్మ్యహం జయ జయ రామా। సర్వహీన స్వరూపోzహం జయ జయ రామా। తుర్యాతీతోzస్మి కేవలో zహం జయ జయ రామా। శ్రీ రామ జయ రామ జయ జయ రామా**

-శ్రీ యజుర్వేదీయ తేజోబిందు ఉపనిషత్తు

ఆఖరికి తాను కానిదేదీ లేదని, అంతా తానే "నీవు చూచునదెల్ల నీవయే యనుచు తత్త్వమసి వాక్యమున కర్థమ్ము నిజము" అని, ఈ ప్రపంచంలో దేనికీ వేరే 'ఆరాటము' - 'ఆ' రాటను బంధింపబడక, విషయాదులలో పడి ఇంద్రియములచేత వశముకాక సర్వమూ భగవంతునిమయమే అని గుర్తించి, భగవంతుని లీలావైభవమును ఆనందంగా అనుభవిస్తూ శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధనలు ఎంతో దివ్యంగా, వైభవోపేతంగా జరుపుకున్నాము.

ఇక ఈ నెల డిశెంబర్ 17వ తారీకునుండి ధనుర్మాసం. ధనుర్మాస వ్రత దీక్షలు మొదలవుతున్నాయి. శ్రీ బాల గోపాల ముకుందుని తలచుకుంటే సర్వ దేవతలు మన దగ్గరనే కాదు, మన ఎదుటనే ఉంటారు కదూ! మనలోన, బయట సర్వమూ శ్రీకృష్ణుని మయమే కదా! శ్రీమద్భాగవతంలో దశమస్కంద ప్రవచనము, మహర్షుల చరిత్ర, తిరుప్పావై పారాయణ, సుందరాకాండ పారాయణలతో మన ఇంద్రియములన్నీ అంతర్ముఖమై, మనోనాథుడైన జగద్గురుదేవుని లీలలతో ఆడుకుందాం రండి ఓ భక్తులారా!ఓ జిజ్ఞాసులారా రండీ! రండీ చెట్టు క్రింద పూజలకు, శ్రవణమునకు రండీ! మేల్కొనండి! - అని అందరినీ ఆహ్వానిస్తూ ఇంత ఆనందమును ప్రసాదించిన శ్రీ గురుదేవులకు శిరసా ప్రణమిల్లుతూ, అందరికీ అఖండ భక్తి జ్ఞానములను శ్రీగురుదేవులు ప్రసాదించెదరుగాక! సుఖీభవ! సుఖీభవ!!

- మీ అమ్మ

# సంపాదకీయం

-పరాశర ప్రసాద్

**గురుమూర్తిం స్మరేనిత్యం గురోర్నామ సదా జపేత్**
**గురోరాజ్ఞాం ప్రకుర్వీత గురోరన్యం న భావయేత్**

జిజ్ఞాసువులైన గురుభక్తులందరూ స్వామివారి ద్వావింశతి వార్షిక పుణ్యారాధన సాప్తాహిక పంచయజ్ఞ విధిపూర్వకంగా నిర్వహింపబడిన కార్యక్రమాలలో పాల్గొని 'గురోరన్యం నభావయేత్' అన్న పదాన్ని సార్థకత చేసుకొని సద్గురుమూర్తి అనుగ్రహానికి పాత్రులైనందుకు ఆనందంగా ఉంది.

శ్రీబాబూజీ మహరాజ్ భక్తులందరినీ ఉద్దేశించి మాట్లాడుతూ ,'ఈ ఆశ్రమం ఎవరిది? మీ అందరిది', అనేవారు. 'ఈ దేహం నాది' అనే భావనతో ఉన్నంతసేపూ మన చుట్టూ గోడలు కట్టుకొని ఇది నాది, అది నీది అని గాని, ఇది నా యిల్లు, ఇది నా మతం, ఇది నా గోత్రం అనే పరిమితి విధించుకోవటం సహజం. ఉపాధిని ఆశ్రయించి ఉన్నంత వరకు ఆ భావన పోదు. ఆత్మభావనలో ఉన్న మహాత్ములకి హద్దులుండవు. సర్వవ్యాపకమైన ఆత్మ వస్తువుకి హద్దులుంటాయా? విశ్వవ్యాప్తమై ఉంటుంది. అంతటా ఉన్నది తానే.

సమర్థులైన సద్గురు మూర్తిని ఆశ్రయించి ఉన్న గురుభక్తులు చింతించవలసిన పని ఏముంది? "గురువు చెప్పినట్లు వింటే వెంట తీసుకు వెళ్తారు. నేను రాను అని మొరాయిస్తే ఎదురు దెబ్బలు తగులుతాయి. నేను రాలేను అని లౌక్యంగా తప్పించుకుంటే వదలి వెళ్ళిపోతారు. భగవన్నామము యందు మనస్సు కల్గియుండి ఆశ్రమం ఎవరికోసం, ఎందుకోసం ఏర్పరచారో గుర్తించి సేవచేయండి. కడుపుకి ఆకలి లేకుండా చేసి, హృదయానికి కావలసిన దానిని అందించారు మహాత్ములు", అన్న మాతాజీ ఉద్బోధని నెమరు వేసుకుంటూ అన్ని కార్యక్రమాలలో చిత్తశుద్ధితో పాల్గొంటారని ఆశిస్తున్నాము.

- ఎడిటర్

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్



"అమ్మ" అనే పదంలో కూడా అతి శక్తివంతములైన బీజములున్నవి. 'అ' బ్రహ్మ బీజము. అది భవరోగాలను, జనన మరణ విష వలయాన్ని, వాసనలను హరించేది. "మ" అనేది అమృత బీజము. ఈ రెండూ కలిసి "అమ్మా" అంటే బ్రహ్మామృత వర్షిణి అవుతుంది. "అమ్మా" అని పిలిచేసరికి, తేనెతుట్ట నుండి తేనెజాలువారినట్లు ప్రేమామృతము పొంగిపొరలుతుంది. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము వాటి గుణాలను పోగొట్టుకుని, సత్యము, శాంతి, దయ, ప్రేమగా మారిపోతాయి. హృదయమంతా అమృతమయమై పోతుంది. అటువంటి అమృత హృదయంలో వెలువడే భావాలు ఎంతో మధురమై అందరికి ఆనందాన్నిచ్చేవిగాను, అందరి ప్రేమను చూరగొనేవిగాను ఉంటాయి. "అమ్మా" అని నోరారా పిలిస్తే, వెంటనే "నాయనా, బాబూ", అంటూ ప్రేమవర్షం కురిపిస్తుంది. "అ" అనే బ్రహ్మబీజం అహంకారాన్ని, 'మ' అనే అమృత బీజం మమకారాన్ని హరించివేస్తాయి. "అమ్మా" అని పిలిస్తే, ఆమెకు చాలా ఇష్టము. బిడ్డ ఎన్ని తప్పులు చేసినా, వస్తువులు పాడుచేసినా, ఎంత అల్లరి చేసినా, తల్లి ఆ బిడ్డపై ప్రేమనే వర్షిస్తుంది. పరిణామ సహితమైన ఈ దేహాన్ని ప్రసాదించే తల్లిదండ్రులకే తమ బిడ్డలపై ఇంత ప్రేమ ఉంటే, భవబంధాలను హరించి శాశ్వతత్వాన్ని ప్రసాదించే జగన్మాతకు, జగత్పితకు తమ బిడ్డలపై ఎంత ప్రేమ ఉండాలి!

అటువంటి జగన్మాతను ధ్యానిస్తే, స్మరిస్తే, పూజిస్తే, అపకారం చేస్తుందా? ధ్యానిస్తే ధన్యత్వాన్ని ప్రసాదిస్తుంది. స్మరిస్తే జనన మరణ ప్రవాహము నుండి తప్పిస్తుంది. పూజిస్తే పునర్జన్మ లేకుండా తనలో లీనం చేసుకుంటుంది. ఏమీ చేయలేకపోయినా, "నేను ఉన్నానని విశ్వసించు, ఆ విశ్వాసాన్ని గట్టిపరచుకో చాలు, నన్ను సదా స్మరించు. నిన్ను సదా రక్షిస్తాను", అని అభయమిచ్చే కరుణా స్వరూపిణి జగన్మాత.

మానవుని అనుక్షణము మృత్యువు వెన్నాడుతూనే ఉన్నది. భగవానుడు మృత్యుంజయుడు. ఆశ్రయించిన వారిని మృత్యువునుండి రక్షిస్తాడు. స్త్రీ రూపంలో జగన్మాతగాను, పురుష రూపంలో భగవానుని గాను రక్షణ యిచ్చేది ఆ అనంతశక్తియే. సగుణ నిర్గుణాతీతంగా ప్రకాశించే ఆత్మవస్తువు కూడా అనంతశక్తియే. దానిని వర్ణించలేక ఉపనిషత్తులు కూడా "ఏకో బ్రహ్మణ ఆనందః" అని ఊరుకున్నాయి.

అటువంటి బ్రహ్మానందమే తన స్వరూపమని గ్రహించలేని మానవుడు క్షణిక సుఖాన్ని, అంతులేని దుఃఖాన్ని కలిగించే విషయ సుఖాల వెంటపడి, అమూల్యము, అత్యల్పము అయిన తన ఆయుర్దాయ కాలాన్ని వ్యర్థం చేసుకుంటున్నాడు. దానికి కారణం అవిద్య లేక అజ్ఞానము, అంటే తానెవరో తనకు తెలియకపోవటమే. పామును చూచి, 'తాడు' అని భ్రమిస్తే దానిని పట్టుకుంటాముగాని, 'పాము' అని తెలిస్తే పట్టుకుంటామా? అగ్నిని చూసి 'పండు' అనుకొని శలభం దాని వద్దకు వెడుతుంది గాని అది తనను దహిస్తుందని తెలిస్తే వెడుతుందా? విషయ సుఖాలు ఎండమావులలోని నీటి వంటివని, శాశ్వత సుఖ ప్రదాత భగవానుడే అని జ్ఞానం కలిగినపుడే మానవుడు విషయాల వెంటపడటం మానేస్తాడు. అటువంటి భగవద్దృష్టి ఏ జన్మలో కలుగుతుందో అదే మానవుని ఆఖరు జన్మ అవుతుంది.

అసలు ఈ మానవ జన్మ లభించటమే ఎన్నో జన్మలలోని పుణ్యలేశములు రాశీభూతం అయినప్పుడే జరుగుతుంది. మానవ జన్మ లభించినా, భగవద్దృష్టి కలగటం చాలా కష్టము. అది కలిగినా, దానిని నిలుపుకోవటం ఇంకా కష్టము. భగవద్దృష్టి నిలుపుకున్న వాడికి ప్రపంచ సుఖాలపై మనస్సు పోదు. "కనిపించని భగవంతుడి కోసం వెదుక్కుంటూ ఎదురుగా లభ్యమవుతున్న ఈ ప్రపంచ సుఖాలను వదులుకుంటావేమిట్రా వెర్రి వెంగళప్పా", అని ప్రక్కవాళ్ళు అవహేళన చేస్తుంటే ఎంతమంది చలించకుండా ఉండగలరు?

తన భక్తుడు పడే ఈ దురవస్థ చూసి జాలిపడిన పరమాత్ముడికి కూడా సమస్యలు తప్పలేదు. నిర్గుణుడైన ఆ పరమాత్మ అనుగ్రహించి కరుణించినా, ఆ గుణ రహితుని గుర్తించలేని గుణహీనులు, అదంతా తమ స్వశక్తి వల్లనే అని విర్రవీగుతారు. కష్టాలు కలిగితే మాత్రం కనిపించని ఆ భగవంతుడి మీదనే నేరం అంతా మోపి నిందించటానికి వెనుకాడరు. పోనీ

అలాగని, సగుణంగానే భగవానుడు ఆకారం ధరించి ఉద్భవిస్తే, తమవలె సాకారుడైన ఆయనను భగవానుడని గుర్తించరు, విశ్వసించరు.

రామావతార కాలంలో ఎంతమంది శ్రీరామచంద్రుని భగవానునిగా గుర్తించగలిగారు? శ్రీకృష్ణావతారం ఇంకా మహిమాన్వితమైనది. ఆయన ఎన్నో దివ్య శక్తులను, మహత్తులను చూపించాడు. దివ్యజ్ఞానామృతాన్ని వెదజల్లాడు. అయినా, దుర్యోధనాదులు ఆయనను భగవానుడని గుర్తించలేకపోగా, ఇంద్రజాలికుడని, జారుడని, చోరుడని, అబద్ధాల పుట్ట అని నిందించారు. కాని ఆ కౌరవ వంశం వాడే అయిన భీష్ముడు, ద్రోణ, విదురాదులు మాత్రం శ్రీకృష్ణ పరమాత్మను మానవ మాత్రునిగా సంబోధిస్తే సహించలేకపోయేవారు. ఈ దూషణలను విన్న మహా దోషాన్ని పరిహరించి అనుగ్రహించమని, ఓం కృష్ణాయనమః అని స్మరించుకునేవారు.

ఇలా శ్రీకృష్ణ పరమాత్మను గురించి పవిత్రము, అద్వైతము అయిన దృష్టి కొందరికి ఉంది. ద్వైత దృష్టి, భేదదృష్టి కొందరికి ఉంది. కాని భగవానుడు మాత్రం అందరిని సమాన దృష్టితో చూచేవాడు. అందరిపైన అనుగ్రహాన్నే వర్షించేవాడు. అనుగ్రహ స్వరూపుడు గనుకనే, దుర్యోధనాది వర్గం వారిని గూడా అనుగ్రహించే ఉద్దేశంతో, వంశ నాశనం కాకుండా, ప్రజానష్టం జరుగకుండా, సంధి చేసుకోమని పాండవుల తరపున రాయబారిగా వెళ్ళాడు. ఆ అవ్యాజ అనుగ్రహాన్ని గూడ అర్థం చేసుకోలేని ఆ వ్యర్థులు చేజేతులా సర్వ నాశనాన్ని కొని తెచ్చుకున్నారు.

జగజ్జననియే పురుషాకృతిలో శ్రీకృష్ణ భగవానుడు. కనుకనే అమ్మ సహస్ర నామాలలో "గోవింద స్వరూపిణీ, నారాయణ స్వరూపిణి, ఈశ్వర స్వరూపిణి, ముక్తి స్వరూపిణి, పరమశాంతి స్వరూపిణి" యిలా ఎన్నో నామాలున్నాయి. జగన్మాత అందించే జ్ఞాన క్షీరములు మనస్సును నిర్మలముగా పవిత్రముగా చేస్తాయి. మనస్సు అతి వేగంతో సంకల్ప రహితము, వృత్తి రహితము అవుతుంది. కెరటాలు లేని సముద్రము వలె మనస్సు ఏ ఆలోచనలు లేకుండా ప్రశాంతమవుతుంది. గాలిలేని దీపం లాగా నిశ్చలమై ప్రకాశిస్తుంది.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

అది విన్న ఆ భక్తుడు ఆనందంతో నృత్యం చేస్తూ, "ఆహా! నిర్హేతుక దయామయా! భక్తవశంకరా! శంకరా! నా ప్రభూ! నిజమేనా ఇది? నాలోనే స్థిరపడతావా! ఏమి నా భాగ్యం'', అని ఆనందాబ్ధిలో ఓలలాడాడు. అది చూసిన రాజు కూడా ఆయనకి అనేక సాష్టాంగ నమస్కారాలు చేస్తాడు. ఇదీ నిజమైన భక్తి అంటే. ఇటువంటి భక్తికి భగవంతుడు దాసోహం అంటాడు. అంతేకానీ బాహ్యాడంబరాలకి ఆయన లొంగడు.



అటువంటి నిర్హేతుకజాయమాన కరుణాకటాక్షం కలిగినటువంటి భగవంతుడిని మనసారా స్మరణ చేసుకుంటే చాలు. 'మాకు పాడడం రాదండీ' అంటారు కొందరు. ప్రతివారిలోనూ శృతిలయలు సహజసిద్ధంగానే వున్నాయి. కాబట్టే మనం మాట్లాడగలుగుతున్నాం. అడుగు తీసి అడుగు వేస్తున్నాం. పాట, తాళం అన్నీ కరెక్టుగా వున్నా మనసు వేరేచోట పెట్టి ఎంత స్మరణ చేసినా అది వృధాయే. విశ్వాసంతో భగవన్నామస్మరణ చేయాలి. దారిని వెళ్తూ గుడిని చూసి దండం పెడతారు. కానీ గుడిలోనికి వెళితే, బయట వదిలిన చెప్పుల మీద వుంటుంది దృష్టి. ఇటువంటిది భక్తి అనిపించుకోదు.

ఒకరికొకరు సహకరించుకుంటూ, అందరూ సాధనలో ముందుకి వెళ్లాలి. సంఘసేవ చేసుకోవాలి. మన భావనే మనకి బంధాన్నిస్తోంది. మన భావనే మనకి ముక్తినీ ఇస్తోంది. శ్మశానానికి వేరుతనం లేదు. రక్తానికి వేరుతనం లేదు. జాతి, నీతి, కుల, గోత్రం, మత భేదాలనే వేరుతనాన్ని ఏరి పారవేసేదే 'సత్సంగం'. మోక్ష సాధానికి రాజమార్గం సత్సంగం. కాలాన్ని లెక్క చూసేది స్మరణ కాదు. కాలాన్ని దాటిపోవాలి. జపమాల ఆగిపోవాలి. మనస్సు భగవత్ చరణారవిందాలపై నిలిచిపోవాలి. అటువంటి నామస్మరణ చేయాలి. మరణభయం లేకుండా చేస్తుంది భగవన్నామస్మరణ.

ఇటువంటి మహత్తరమైన విషయాలు మనకి సత్సంగంలో, మహాత్ముల సన్నిధిలో దొరుకుతాయి. అవి వెలలేనటువంటి రత్నాలు. అటువంటి రత్నరాసులని మహాత్ములు కురిపిస్తున్నారు. వాటిని ఎన్ని ఏరుకోగలిగితే అన్ని ఏరుకుని మూటగట్టుకోవాలి. వారి వాక్కులని కేవలం వినడంతో సరిపెట్టుకోకూడదు. విన్నది మననం చేసుకోవాలి. మననం చేసుకున్నది ఆచరణలో పెట్టాలి. మననం ద్వారా, మన+న అంటే, మనస్సు లేకుండా పోతుంది. ఆచరణ అంటే ఆ-సమంతాత్ అంటే అంతటా వ్యాపించివున్న ఆ చరణం (పాదం) నడిచిన బాటలో చరించడమే (నడవడమే) ఆచరణ.

మహాత్ములు తెలిపిన బాటలో నడవడానికి కావలసిన ఆచరణను, అఖండ సాధన సంపత్తిని, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా మనలను కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!

హరి: ఓం తత్సత్

## 9. గురు శిష్యన్యాయం

(29.03.2003 - విజయవాడ)

ఎంతెంతో మంది విద్వాంసులు, శాస్త్రజ్ఞులు ఉన్నటువంటి ఈ సభలో ఏ చదువులూ చదవని నా వంటిది మాట్లాడుతోంది అంటే అది కేవలం సద్గురుదేవుల కృపా విశేషం మాత్రమే. ప్రపంచంలో ఉండి, ప్రపంచంలోని కదలికలు చూస్తే భయంగానే ఉంటుంది. కానీ, అభయమూర్తియైన సద్గురునాధులు ఉండగా మనకి భయమేమిటి? నిర్భయమేవ అభయం! గురుమూర్తి సగుణ నిర్గుణ అతీతులు. సృష్టినంతటనీ నడిపిస్తున్న ఏ అనంత శక్తి అయితే ఉన్నదో, ఆ శక్తే మనని ఉద్ధరించడానికై గురురూపం దాల్చి వస్తున్నది. ఆ గురుమూర్తి శిష్యునికి ఎన్నెన్నో పరీక్షలు పెడతారు. సాన పెడితేనే వజ్రం ప్రకాశిస్తుంది కదా! పందిరి రాటలు పాతి, కదిపి కదిపి చూస్తాం. ఏ మాత్రం ఊగిసలాడినా, దానిని కొట్టి కొట్టి నేలలోకి బాగా పాతుకొనేటట్లు చూస్తాం ఎందుకని? గాలి యొక్క ఆటుకీ పోటుకీ పడిపోకుండా ఉండాలనే కదా! అదే విధంగా తన శిష్యుడు లక్ష్యాన్ని చేరుకోవడానికి తగిన అర్హతలు కలిగి ఉన్నాడా లేదా అని చూస్తారు గురుదేవులు.

గురుశిష్య న్యాయాన్ని 'కఠోపనిషత్తు' ఎంతో చక్కగా వర్ణిస్తుంది. గురుమూర్తి దగ్గర శిష్యుడైనవాడు ఎలా మసలుకోవాలో నచికేతుడి ద్వారా మనకు తెలుస్తుంది. సాక్షాత్తు మృత్యుదేవతయైన యమధర్మరాజుని కూడా

తల వంచేటట్లు చేశాడా శిష్యపరమాణువు. బ్రతికి ఉండగానే బ్రహ్మజ్ఞానాన్ని పొందటమే ముక్తి. అది సాధించాడు బాలుడైన నచికేతుడు.

'కఠోపనిషత్తు' ఆచరణ కఠినమే. తదనుభూతిని పొందటానికి కఠిన సాధన చేయాల్సిందే. వేదాలు కఠినమని, వాటినుండి ఉపనిషత్తులు, ఉపనిషత్తుల నుండి భగవన్నామం వచ్చాయి. 'కనీసం భగవన్నామ స్మరణ చేయండి అది చాలు ఈ కలికాలంలో తరించడానికి' అంటే అది కూడా చేయలేక పోతున్నాము. మరి చిన్నారి బాలుడైనా నచికేతుడు ఎంతటి తీవ్ర వైరాగ్యంతో తాననుకున్నది సాధించాడు! ఎటువంటి ప్రలోభాలకీ లొంగలేదే! కాస్త సూక్ష్మంగా కఠోపనిషత్తు పూర్వగాథ చెప్పుకుందాం.

వాజశ్రవుడు అనే బ్రాహ్మణుడొకడు విశ్వజిద్యాగమనే ఒక యాగాన్ని చేస్తున్నాడు. అది ఒక్క రోజులో పూర్తి కావలసిన యాగం . ఆ యాగంలో యాగకర్త తనకున్న యావదాస్తినీ దానం చేయవలసి ఉంటుంది. మాములుగా కూడా మనం ఏది తింటామో అదే మనం ఇతరులకి పెట్టాలి. అంతేకాదు, 'శ్రియా దేయం, హ్రియా దేయం, సంవిదాదేయం' అని చెబుతోంది తైత్తిరీయోపనిషత్తు. మనకి వచ్చినదాంట్లో సోమరితనం లేకుండా ఇతరులకి పంచి ఇవ్వాలి.

అయితే ఇక్కడ వాజశ్రవుడు ఏం చేస్తున్నాడంటే, బక్కచిక్కిపోయిన ఆవులని, వట్టిపోయిన ఆవులని, నేడో రేపో అన్నట్లుగా ఉన్న ఆవులని దానం చేస్తూ వున్నాడు. అది చూసిన వాజశ్రవుని కుమారుడు నచికేతుడు బాధపడి అడ్డుపడతాడు. అటువంటి దానం వలన తన తండ్రికి సద్గతి బదులు దుర్గతి ప్రాప్తిస్తుందే అని విచారించి ఆయన్ని ఆ పాపంనుండి తప్పించుదామని 'అన్నిటినీ దానం చేస్తున్నారు కదా నాన్నగారూ! నన్నెవరికి ఇస్తారు', అని అడుగుతాడు. ఆ ఏకత్వ భావన పుట్టుకతోనే ఎలా వచ్చిందో చూడండి నచికేతుడికి! తన ఇంట్లో ఆవులతో సమానంగా తననెంచుకున్నాడు! తండ్రి వినిపించుకోక పోయేసరికి ముమ్మారు అదే ప్రశ్న వేస్తాడు నచికేతుడు. వాజశ్రవుడు విసుగుతో 'నిన్ను యముడికిస్తాను' అంటాడు.

-సశేషం

## సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

మనము ఎప్పుడూ ఒక విషయాన్ని చెప్పుకుంటూ ఉంటాము. 'చేతులు కాళ్ళు కట్టబడినవాడు ఊరంతా సంచరిస్తాడు. చేతులు కాళ్ళు బంధింపబడని వాడు కదలడు. 'ఒక వ్యక్తిచక్కని పద్మాసనంలో కూర్చుని ధ్యానం చేసుకుంటున్నాడు. అతని దేహం మాత్రం స్థిరంగా కదలకుండా ఉంది. ఆ వ్యక్తి మనస్సు ఎక్కడెక్కడో సంచరిస్తోంది. ఆ వ్యక్తిని చూసి మీరంతా మహాభక్తునిగా భావిస్తారు. ఎంతో చక్కగా ధ్యానం చేసుకుంటున్నాడు అనుకుంటారు. కాని అతని మనస్సు ఎక్కడ ఉంది? కాని మహాత్ములు అలా కారు. వారు అందరి మధ్య సంచరిస్తూనే ఉంటారు. కాని వారి మనస్సు ఎప్పుడూ ఆత్మ వస్తువుతో రమిస్తూ ఉంటుంది. ఇక్కడ మీరు దీనిని అర్థం చేసుకుంటే చాలు.'

దాస్! అకర్మలో కర్మ అంటే తెలుసా? ఒక వ్యక్తి ఉంటాడు. ముఖం పద్మదళాకారం, వర్చస్సు చందన శీతలం, కాని వాడి మనస్సు మాత్రం కత్తులబోను. మంగలికత్తి కన్న పదునైనది. ఇంద్రియాలతో ఏ కర్మ ఆచరించక పోయినా మనస్సు సంకల్పించటం ద్వారా కర్మని మూట కట్టుకుంటాడు. దానిని అకర్మలో కర్మ అంటారు. కాబట్టి మనో లయమైతే అప్పుడు మాత్రమే కర్మలు నశిస్తాయి. అదే గీతాచార్యుడు చెప్పాడు జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం అనే చెపుతున్నాడు. ధ్యానం చేయండి. దాని ద్వారా ఉత్పన్నమైన అగ్ని మీకు ఎన్నో జన్మల నుంచి ఆర్జించిన వాసన నుండి విముక్తి కల్గుతుంది అన్నారు శ్రీబాబు.

**17-5-1985**

ఈ రోజు రాత్రి శ్రీబాబు భక్తులకు ఉద్బోధ చేస్తుండగా చరణదాస్ పూర్వజన్మ వివరాలు కొంతమంది చెప్పగలుగుతారు కదా! అది ఎలా సాధ్యపడుతుంది, అని ప్రశ్నించారు.

శ్రీబాబు మాట్లాడుతూ పూర్వజన్మ స్మృతిని గూర్చి తెలిసికొనగోరటం తగని పని. అది దేవరహస్యం. గురుశిష్యుల సంబంధం జన్మ జన్మల సంబంధం. గురుదేవునికి జనన మరణాలు లేవు. శిష్యుడు మాత్రం అనేక జన్మల నుంచి ఆ గురుదేవునితో సంబంధం కలిగి ఉంటాడు. గురుదేవులు ఆ దేవరహస్యాలను వెల్లడించరు. అంత ఎందుకు నీ వ్యక్తిగత రహస్యాలుకాని, నీ స్నేహితుల రహస్యాలనుగాని నువ్వు చెప్పమంటే చెబుతావటయ్యా దాస్,

అని ప్రశ్నించారు. దేవ రహస్యాలను వెల్లడిచేయ వచ్చు. కాని దాని వలన ఆ వ్యక్తికే నష్టం. దేవ రహస్యాలను కోరాడు అంటే ఆ వ్యక్తి అజ్ఞానంతో కూడి ఉన్నట్లే. చీకటిలో ఉన్న వ్యక్తికి ఏమి గోచరిస్తుంది? అజ్ఞానంలో అతనికి విషసర్పాలు, తేళ్ళు, మండ్రగప్పలు తప్ప ఏమీ గోచరించవు. వాటివలన అతనికి హాని తప్పదు.

గురుకృప ద్వారా అన్నీ స్వానుభవం వలన తెలిసికోవాలనేదే గురులక్ష్యం. గురులక్ష్యార్థం పైన దృష్టిని నిలిపితే జ్ఞానమనే వెలుగులో జ్ఞానరత్నాన్ని దర్శించగలుగుతాడు. అయ్యో! ఇంతకాలం ఈ రత్నాన్ని తెలిసికోలేకపోయానే అని బాధపడతాడు. ఒక మొక్క ప్రారంభదశలో రెబ్బలు వేస్తుంది. తరువాత పుష్పిస్తుంది. అటు పిమ్మట ఫలాన్ని ఇస్తుంది. అయితే ఇప్పుడు పుష్పాలను, ఫలాలను ఇవ్వటానికి కారణం ఏమిటి, అని ప్రశ్నిస్తే ఏమి సమాధానం ఇస్తాము? ఏ కాలానికి ఏది అవసరమో దానిని సమకూర్చ గలిగేదే దైవశక్తి.

మీ కందరికీ ఒక రహస్యాన్ని తెలియజేస్తాను. డా॥సోమయ్యగారికి భగవంతునిపై అంత దృష్టి లేదు. కాని ఆయన భార్య మాత్రం భక్తురాలు. వారికి సంతానం లేదు. ప్రథమంగా సోమయ్యగారు మద్రాసులో ఉండగా వారి ఇంటికి వెళ్ళాను. వారికి సంతానం లేదని బాధపడుతున్నారు. వారికి దీక్ష ఇచ్చాను. 41రోజుల దీక్ష. దీక్షపూర్తికాగానే సోమయ్యగారి భార్య గర్భవతి అయింది. అయినా సోమయ్యగారికి ఇంకా భగవంతుని యందు అంత నమ్మకం కుదరలేదు. ఇంతలో సోమయ్యగారు ఫ్రాన్స్ వెళ్ళారు. ఆ సమయంలో నేను వారింటనే బసచేసి వరండాలో చలిలో పడుకుని వారి కుటుంబానికి రక్షణ ఇచ్చాను.

సోమయ్యగారు ఫ్రాన్స్ నుంచి వచ్చిన తరువాత విషయం తెలిసికొని నన్ను గురువుగా భావించారు. ఆ క్షణం నుంచి బ్రహ్మచర్యాన్ని అవలంబించారు. మంచి రాజర్షిగా మారారు. ఈ విషయం ఎవరికీ తెలియదు. వృద్ధనారీ పతివ్రత అనే సామెత మీకు తెలిసినదేకదా! కాని చిన్న వయస్సులో బ్రహ్మచర్యం అవలంబించటం విశేషం. బ్రహ్మచర్యం అవలంబించేవారంటే నాకు చాలా ఇష్టం. అందుకే నేను తరచు సోమయ్యగారింటికి వెళ్తూ ఉండేవాడిని. నేను ఒకేరోజు కాశీలోను, రామేశ్వరంలోను అభిషేకం చేసిన విషయం తెలిసినవారు ముగ్గురు వ్యక్తులే. అందులో చిరంజీవిరాజు, శేషగిరిరావుగార్లు కాకుండా సోమయ్యగారు కూడా ఉన్నారు అన్నారు.

ఇంతలో విశాఖపట్నం నుంచి వచ్చిన ప్రసాదరావుగారు మాట్లాడుతూ సాధనకి ప్రతిబంధకం అవుతుందాండీ, అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ చూశారా! ఇదే నిరూపణ. నేను చెప్పిన రహస్యం వలననే కదా మరి ప్రసాదరావుగార్కి సందేహం కలిగింది అన్నారు. ఇంకా మాట్లాడుతూ భార్యా భర్తల దాంపత్య జీవితంలో పొందే భౌతికానందం క్షణికమైనది. దాని స్థానంలో ప్రేమని పెంపొందించుకోవాలి. అది భక్తి ద్వారా సాధ్యపడుతుంది. ఒక వ్యక్తి వద్ద కైజార్ ఉందనుకోండి అది అన్ని వైపులా పదును కలిగి ఉంటుంది. ఆ వ్యక్తి దగ్గరకి రావటానికి అందరూ భయపడతారు. అది ఆ వ్యక్తికి రక్షణ. అలాగే గురుమూర్తి యందు అచంచల భక్తి విశ్వాసాలు కలిగిన వాడికి గురుకృప రక్షక కవచంగా ఉంటుంది. అటువంటి వ్యక్తి గృహస్థాశ్రమంలో ఉంటే మాత్రం ఏమి?

కుక్కల మాణిక్యంగారని ఒక మహాత్ముడు ఉండేవాడు. ఆయన ఒక కౌపీనం ధరించేవాడు. కాలువ గట్టున లాకుల వంతెన మీద కూర్చునేవాడు. మీసాలు మెలేసిన రాజులంతా ఆయన శిష్యులే. ఆయన శిష్యులలో ఒక క్షత్రియుని ఇంటిలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడని ఎవరో గిట్టనివాళ్ళు ఫిర్యాదు చేస్తే పోలీసులు ఆ గ్రామానికి దర్యాప్తు కోసం వచ్చారు. ఆ పోలీసు వారిని మాణిక్యంగారు 'ఏరా! ఎక్కడకి', అని అడిగారు. పోలీసులు ఆయన వేషం చూసి ఎవరో పిచ్చివాడిలా ఉన్నాడని అనుకొని 'పోరా! నీకెందుకు', అని సమాధానం ఇచ్చారు. మాణిక్యంగారు మాట్లాడుతూ 'అంత నిర్లక్ష్యంగా సమాధానం చెపుతారా మీకు ఈ గ్రామంలో తిండి కూడా దొరకదురా', అన్నారు.

పోలీసులు ఆ గ్రామం అంతా వెదకినా ఎక్కడా గంజాయి మొక్కలు కనిపించలేదు. గంజాయి మొక్కలన్నీ బంతి మొక్కల్లాగా కనిపించాయి. ఆ ఊళ్ళో ఎవరూ కాఫీ కూడా ఇవ్వలేదు. చివరకి విసుగు వచ్చి వచ్చేశారు. వారిని చూసి మాణిక్యంగారు ఏరా! వచ్చేశారు? గంజాయి మొక్కలు దొరికాయా? పాపం! మీకు తిండి కూడా లేకుండా పోయిందిరా! ఇవిగో ఇక్కడ ఉన్నాయి గంజాయి మొక్కలు అని రోడ్డు ప్రక్కన ఉన్న రెండు మొక్కలు పీకి పోలీసువారికి ఇచ్చారు. అవి వాసనకి గంజాయి మొక్కలలా ఉన్నాయి. కాని, బంతి మొక్కలలాగా కనబడ్డాయి. ఈయన ఎవరో మహాత్ముడిలా ఉన్నారు అని తెలిసికొని పోలీసులు ఆయనకి నమస్కరించి వెళ్ళిపోయారు. -సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**డిశంబరు 2010**

**1 బుధ** తె.జా. 3 గం.లకు శ్రీ సద్గురుదేవులకు రుద్ర, నమక చమక సహిత మహాభిషేకము. దీక్షావిరమణ, మహామంగళహారతి. శ్రీ సద్గురుదేవుల నగరోత్సవము.

**గమనిక :** పెద నింద్రకొలను ఆశ్రమశాఖలో శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన, సత్సంగం, తెప్పోత్సవం.

**3 శుక్ర** శ్రీ సద్గురుదేవులు ఆంగ్ల కాలమాన ప్రకారం స్వస్వరూపలయం పొందిన రోజు, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**4 శని** మాస శివ రాత్రి

**11 శని** శ్రీ సుబ్రహ్మణ్యషష్టి, శ్రీ స్వామికి అభిషేకము, సహస్రనామార్చన.

**17 శుక్ర నుండి ధనుర్మాస కార్యక్రమాలు** -

ఉదయం 9.30 గం,లకు సంకీర్తన, 10 గం. లకు తిరుప్పావై,
10.30 గం.లకు ఋషుల చరిత్ర, 11 గం.లకు శ్రీమదాంధ్ర మహాభాగవత ప్రవచనము, సత్సంగం, ప్రార్థన, తీర్థ ప్రసాదములు.

**17 శుక్ర** గీతా జయంతి, ముక్కోటి ఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ, ఏకాహం, భక్త సమారాధన

**21 మంగ** పూర్ణిమ, దత్తాత్రేయ జయంతి, శ్రీ సద్గురు పాదపూజ

**25 శని** క్రిస్మస్ - శ్రీసద్గురు పాదపూజ. సత్సంగం.

**30 గురు** గురుదశమి, సత్సంగం శ్రీ సద్గురు పాదపూజ

**జనవరి 2011**

**1 శని** ఆంగ్ల సంవత్సరాది, శ్రీ సద్గురు పాదపూజ - భక్త సమారాధన

**14 శుక్ర** మాస శివరాత్రి, భోగి, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన, రాత్రి 8 గం.లకు శ్రీ సద్గురుదేవులకు భోగి పళ్ళు పోయుట

**15 శని** మకర సంక్రాంతి,శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**16 ఆది** కనుమ, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**19 బుధ** పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ

**28 శుక్ర** శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

# శ్రీమాతాజీవారి నవరాత్రి సందేశాలు

- రాధ

శ్రీసరస్వతీమాత అంతర్వాహిని. ఆవిడ ఎక్కడ ఉంది? రసతిః భజతిః సోఽమృతో భవతిః అన్నారు గురుదేవులు. బ్రహ్మామృతం అనే రసానుభూతి ఆత్మ దర్శనాన్ని పొందింపజేస్తుంది. రసతి అనేది ద్రవించేది. పాషాణం కాదు. ప్రభువులో ప్రకాశించే తత్త్వం మనలో కూడ ఉంది. దానిని ఆస్వాదించాలి. ఆ రసానుభూతిని పొందాలి.

ఆసేవలో ఉన్నవాడికి అమృతత్త్వమే. మరణం గుర్తుకు వస్తుందా? మనలో మూలాన్ని గుర్తించాలంటే తగిన దృష్టి కావాలి. మనలో అంతరాంతరాలలో నిర్గుణంగా వ్యాప్తమై ఉంది. సాకారంలో ఉంటేనే మనం నిర్గుణం గురించి మాట్లాడుకోగలుగుతున్నాము. నిర్గుణంలో మాటలు లేవు.

ఈ క్షణంలో కూర్చుని ఎవరికి వారు ఆలోచించుకుంటే కాలం వెళ్ళిపోతుంది. పోయిన కాలం తిరిగిరాదు. శరీరంలో ఆయుర్దాయం కూడ కొంత పోయింది. అది వెనుకకు మరలుతుందా? అసంభవం. మనకి తెలియకుండానే అయిపోతోంది. కాని భగవంతుని ధ్యానంలో ఉన్న వాడికిగాని, పట్టుదలతో సాధన చేసేవాడికి గాని, మనలో ఉన్న అనంత శక్తిని సద్వినియోగం చేసుకునే వాడికిగాని కాలం తెలుస్తోందా?

మానసికంగా చేసుకునే ఎవరిపూజ వారిదే సుమా! బయట ఎన్ని పూజలు చేసినా, చేయించినా ఎవరికి ప్రయోజనం? బ్రహ్మవిద్యని అభ్యసించే వాడికి గురుమూర్తిని గుర్తించే అనుభూతి అతని సొత్తు అవుతుంది.

గోపికలు బ్రహ్మవిద్యని గుర్తించారు గనుకనే కృష్ణప్రభువు యొక్క ప్రేమని పొందగలిగారు. **ధి యో యోనః ప్రచోదయాత్** అంటే బుద్ధి సాక్షిణి అయింది. మనస్సుని మూలాధారంలో నిలిపి శ్రీగణపతిని సాధనలో ఉన్నత స్థితికి తీసుకు వెళ్ళమని ప్రార్థిస్తే

ఏమవుతుంది? షట్చక్రాలకు ఆవల సహస్రార కమలంలో ప్రకాశించే అమ్మ దర్శనాన్ని పొందగల్గుతావు.

నీ జీవితం అనే స్వప్న ప్రపంచాన్ని, నీవు యదార్థమని భావించినదాన్ని వెలుకువ రాగానే అది యదార్థం కాదని తెలుసుకుంటావు. జ్ఞానమనే వెలుగును మహాత్ములు అందజేస్తున్నారు. కాని దానిని అందుకోవాలి కదా!

భగవంతుడు నిన్ను ఎప్పుడూ వదలడు. నీతోనే ఉంటాడు. కాని నీ మనస్సు ఆయనకి దూరంగా వెళ్తోంది. ఆయా పెంపకంలో పెరిగిన పిల్లవాడు తల్లి దగ్గరకు వెళ్తాడా! వెళ్ళడు.

శమాది షట్కసంపత్తి అంటే ఏమిటి? అన్నింటిని సన్యసించటమే. బ్రహ్మ పదార్థమును గురించి విచారణ చేయగా చేయగా దానిలో మనస్సు లయించిపోతుంది. నిన్ను నువ్వు మరచిపోవటం లేదుకదా! నీలో ఉన్న నిన్ను గుర్తించు. మనలోని జ్ఞానమనే అంతర్వాహినియే సరస్వతీ దేవి. *

## సాధువులు ఉదర పోషణార్థం పని చేయరు

బలిష్ఠంగా, పొడవుగా ఉన్న మలబారు దేశీయుడు ముందు పోలీసుగా పని చేసి సన్యసించాడు. అంగవస్త్రం తప్ప అతనికి నాదనేదేదీ లేదు. భిక్షకొకసారి వెళ్ళినప్పుడు గృహస్థుడు ఒకడు 'బలంగా ఉన్నావు, అడుక్కోకపోతే పనిచేసుకు బ్రతకరాదా' అని నిష్ఠూరంగా అన్నాడు. నా దొడ్లో దుంగలున్నాయి వాటిని చీల్చి వంటపుల్లలుగా చేస్తే ఈ పూట భోజనం పెడతాననీ' అన్నాడు.

సన్యాసి అతనిచ్చిన గొడ్డలి తీసుకుని పుల్లలన్నీ చక్కగా కొట్టి పేర్చి గొడ్డలి అక్కడే వదలి వెళ్ళిపోతున్నాడు. గృహస్థు అది చూచి అతన్ని వెనక్కి పిలిచి, 'భోజనం చేయకుండా ఎందుకు వెళ్ళిపోతున్నావు', అని అడిగాడు. 'నేను పనిచేసిన చోట భోజనం చెయ్యను. భిక్ష స్వీకరించిన చోట పని చెయ్యను' అంటూ వెళ్ళిపోయాడు.

సాధువులు ప్రేమాభిమానులు, భక్తితో ఇచ్చినదే స్వీకరిస్తారు.

# సంత్ నామదేవ్ చరితామృతం

(గత సంచిక తరువాయి) -మనోజ్ కుమార్

మనిద్దరి మధ్య ద్వైతాన్ని కడతేర్చి నాకు కూడా అద్వైతానుభవాన్ని ప్రసాదించు" అంటూ ఇక ఆపుకోలేక బిగ్గరగా ఏడ్చింది.

**నామ -** జనీ! నా విహిత కర్తవ్యం పూర్తి అయింది. ఇంకా నీ కర్తవ్యం మిగిలి ఉంది. నీ తిరగలి ఆగితే ప్రపంచం అంతా ఆగిపోతుంది. రాజాయిని జాగ్రత్తగా చూసుకో. ఆమెకు కర్తవ్యం బోధించి. అందరికీ తల్లివై అందరినీ జాగ్రత్తగా చూసుకో. ఈ మెట్ల వద్దనే నా సమాధి ప్రక్కనే నీకు చోటు ఆరక్షించి పెట్టాను. నీ సమయం వచ్చినప్పుడు నీవు రాగలవు. బేలవు కాకు" అని సమాధాన పరచటానికి విఫల ప్రయత్నం చేశాడు. కన్నీళ్ళు ధారలుగా కారిపోతుంటే వివశ అయి జని నామా పాదాలవద్ద ఆ మెట్ల మీదే కుప్పకూలినట్లు పడిపోయింది.

ఆనాటి రాత్రి ఇంట్లో అందరినీ దగ్గర కూర్చోబెట్టుకుని నామదేవుడు తన సమాధి సంగతి చెప్పాడు. చివరకు అందరం ఒకే చోటుకు చేరుకుంటాము అని సమాధాన పరిచాడు. రాజాయి మాత్రం సమాధాన పడలేదు.

**రాజాయి -** ప్రభూ! ఇరవై ఏళ్ళ తరువాత తిరిగి వచ్చారు. ఇన్నాళ్ళూ అన్ని కష్టాలు తట్టుకుంటూ ఏ ఆశతో మీ వియోగ బాధను సహిస్తూ వచ్చానో దానిని అడియాస చేయకండి. ఇక మిమ్మల్ని వదలి నేను క్షణం కూడ జీవించలేను. నేనూ సమాధి సహగమన పుణ్యం సంపాదించుకుంటాను.

**నామ -** రాజాయి! ఇప్పటి దాకా నీవు ఈ సంసారాన్ని చక్కబెట్టుకొచ్చావు. ఇప్పుడు లాడాయి కడుపున వంశాకురం ఉద్భవించి ఇంటికి దీపం రాబోతున్నది. ఆ బాల కృష్ణుడి ముద్దు మురిపాలు తీర్చే నాయనమ్మవు కావాలి నీవు. తరువాత నీ కెలా ఇష్టం అయితే అలా చేయి.

ఎలాగైతేనేం చివరకు ఎంతో కష్టం మీద నామదేవుడు రాజాయిని సమాధాన పరిచాడు.

ఆషాఢ వద్య త్రయోదశి వచ్చింది. నామదేవుడు గరుడస్తంభం దగ్గర పద్మాసనం వేసుకుని కూర్చొని, జ్ఞానదేవుణ్ణి తలచుకుంటున్నారు. బ్రాహ్మీ ముహూర్తం సమీపిస్తుండగా ఆయన నలుగురు కొడుకులు ఆయనను చేతుల్లో

ఎత్తి పట్టుకుని నాలుగు కాళ్ళ చెక్కపై కూర్చోబెట్టారు. వేడి నీళ్ళతో స్నానం చేయించారు. చందనం, సుగంధ ద్రవ్యాలు పూశారు. నుదుట చందనం బొట్టు పెట్టి తులసి మాల వేశారు. అక్షతలతో పసుపు కుంకుమలతో పూజ చేశారు. సూర్యోదయం కాగానే జ్ఞానదేవుడి 'పసాయదాన్' చెప్తున్న నామదేవుణ్ణి పిల్లలు పాండురంగడి ఎదుటకి తీసుకెళ్ళారు. కళ్ళనిండా విఠలుడి మూర్తిని నింపుకున్న నామదేవులను సమాధి స్థానానికి తెచ్చారు. జయ జయ రామకృష్ణ హరీ అన్న సంకీర్తన మిన్నుముట్టుతున్నది. పరిసా, విఠా ఇద్దరూ నామదేవుణ్ణి సమాధి స్థానంలో కూర్చోబెట్టారు. రాజాయి కళ్ళు తిరిగి జనిపై పడిపోయింది. అందరూ మూగగా అశ్రువులు రాలుస్తూ నామదేవుని పైన పుష్పవర్షం కురిపించారు. ఆ ఆషాఢ వద్య త్రయోదశి పుణ్య దినాన 'పసాయదాన్' చెప్తూ నామదేవులు సమాధిని పొందారు. పరిసా కూడా 'పసాయదాన్' పాడుతూ నామదేవుడి సమాధిపైన అంతిమ శిలను స్థిరపరిచాడు. అందరూ నామదేవుడి అభంగాన్ని బిగ్గరగా పాడారు.

**"ఆతా విశ్వాత్మకే దేవే ఏణీ వాగచ్య తోషోని**
**తోషోని మజద్వావె పసాయదాన్ హే**
**జే ఖలాంచీ వ్యంకటీ సాండో తయా సత్కర్మీ రతివాఢో**
**భూతాం పరస్పరె పడోమైత్ర జీవాచే**
**దురితాచే తిమిర్ జావే విశ్వ స్వధర్మ సూర్యే పాహో**
**జోజే వాంఛిన తో తే లాహో ప్రాణిజాత్"**
**హరిః ఓం తత్సత్!**

## టీ.వీలో శ్రీమాతాజీవారి కార్యక్రమాలు

**శ్రీ మాతాజీవారి కార్యక్రమములు ప్రతిరోజు భక్తి ఛానెల్‌లో ఉదయం 5 గం॥ నుండి మరియు టి.వీ -(1) ఛానెల్‌లో 5గం॥30ని॥ నుండిమరియు భక్తి ఛానెల్‌లో అదనంగా ప్రతి శుక్రవారం, శనివారం సాయంత్రం 5 గం॥నుండి ప్రసారమౌతున్నాయి. భక్తులు విని తరించగలరు.**

# కృష్ణతత్త్వము, ప్రేమ యోగము

(గత సంచిక తరువాయి)

- సుషుమ్న ప్రసాద

ఆయుధములతో, అంతర్ధానమై పోయింది. వెంటనే మాయ పొరలు తొలగిపోయి, ప్రవీరునకు సత్యము సాక్షాత్కరించి, వ్యామోహమునకు లోనై, అయ్యో ఎంతటి పాపమునకు ఒడిగట్టానని పశ్చాత్తాపముతో విలపించాడు.

తరువాత ఈ క్రియ వెనుక భగవంతుని అదృశ్యహస్తము ఉంటుందని భావించి, కినుక వహించి, కృష్ణ స్వామితో ఇలా మాట్లాడాడు "ప్రభూ, మాయా ప్రభావముతో మీరిచ్చిన ఆయుధములను నాకు లేకుండ చేయటమే మీ ఉద్దేశమైతే, ఆయుధములను నాకెందుకు కంటి తుడుపుగా ప్రసాదించారు" అని ప్రశ్నించాడు. అప్పుడు కృష్ణ పరమాత్మ "ప్రియమైన ప్రవీరా! ఆ ఆయుధములను నేను నీ వద్దనుంచి తీసుకొనలేదు. నీకు దక్కకుండా చేయటమే నా ఉద్దేశ్యమైతే, నీకు ఇవ్వవలసిన అగత్యమే లేదు" అన్నాడు. వెంటనే ప్రవీరుడు,"అలాగైతే స్వామీ, మీరీ యుద్ధములో అర్జునునకు సహాయము చేయకండి. నేను మిమ్ములను నా ప్రాణాధికముగ ఆరాధిస్తున్నాను. నా భక్తి అర్జునుని భక్తికి ఏ విధంగానూ తీసిపోదు",అన్నాడు.

ప్రవీరుని మాటలు విని, అర్జునుడు కృష్ణ భగవానునితో "నేను మీ సహాయమునర్థించి యుద్ధ భూమి కాహ్వానించాను. ప్రవీరుడు యుద్ధము చేయలేకపోతే, యజ్ఞాశ్వమును వదిలి పెట్టమనండి", అన్నాడు. అప్పుడు క్రోధావేశముతో ప్రవీరుడు "నేను అశ్వమును వదిలి పెట్టటానికి బంధించ లేదు" అని మాటలతో కాలమును వృథా చేయకుండా, ఇరువురు హోరా హోరి పోరాటము ప్రారంభించారు. కాని అర్జునుని శౌర్యము, ప్రతిభాపాటవమంతా, ప్రవీరుని ముందు వెల వెల బోయింది.

అప్పుడు కృష్ణ భగవానుడు అర్జునునితో "అర్జునా, చూశావా, భక్తి యొక్క శక్తి ఎంత అపారమో! నేను నీకు సహాయము చేస్తున్నా, ప్రవీరుడు నీపై ఎలా విజృంభిస్తున్నాడో!" అర్జునుడు తన శర పరంపరను విరామము లేకుండ ప్రవీరునిపై ప్రయోగించి, స్వామినుద్దేశించి "ప్రభూ అందుకే నేను మిమ్ములను యుద్ధ భూమి కాహ్వానించి, నాకు సహాయము చేయమని అర్థించాను. మీ అనుగ్రహ విశేషముతో ప్రవీరుని ఒక త్రుటిలో జయించ

గలను",అన్నాడు. అర్జునుడు సంధించిన శర పరంపరను సగం దూరమైనా చేరక మునుపే, ప్రవీరుడు వాటిని మధ్యలోనే ఛేధించాడు. కాని చివరకు ఆ రోజు యుద్ధములో విజయము, అర్జునుని హస్తగతమైనది.

అప్పుడు ప్రవీరుడు ఆగ్రహావేశముతో "అర్జునా, ఇది ప్రభువు విజయము. మీ విజయముగా నేను భావించను. కృష్ణ ప్రభువు సహాయము లేకుండా, మీరు నన్ను జయించినప్పుడే, మిమ్ములను మహావీరునిగా పరిగణిస్తాను" అన్నాడు. "అందులకు అర్జునుడు "నేను స్వామిని నాకు సహాయము చేయటానికే ఆహ్వానించినపుడు, వారి సహాయము నెందుకు నిరాకరించాలి? నీవు నాతో యుద్ధానికి భయపడితే, నీవు యుద్ధ భూమికి వీడ్కోలు చెప్పి వెళ్ళవచ్చును" అని సమాధానం చెప్పాడు.

అర్జునుని సమాధానం విన్న మహాభక్తుడు ప్రవీరుడు కృష్ణ భగవానునుద్దేశించి ఇలా మాట్లాడాడు, "హే నా ప్రియాతి ప్రియమైన దేవాదిదేవా! మీరందరికీ చెందిన వారుకదా ఎందుకిలా యుద్ధభూమిలో పక్షపాతం చూపుతున్నారు?"

అందులకు సమాధానంగా కృష్ణుడు విశ్వాన్నంతటిని మోహింపచేసే చిరునవ్వు నవ్వాడు. వెంటనే ప్రవీరుడు కృష్ణ పరమాత్మ తనపై, పరమానుగ్రహము చూపుతున్నట్లు భావించి, స్వామి కరకమలము గట్టిగా పట్టుకొని తన రథము నధిరోహింప చేశాడు. ఇప్పుడు ప్రగాఢ విశ్వాసముతో ప్రవీరుడు "మీరిప్పుడు ఇచ్ఛ వచ్చిన రీతిలో యుద్ధము చేయ వచ్చును. యుద్ధము నుండి పారిపోవటమో, లేక శాశ్వత నిద్ర నాహ్వానించటమో చేయవచ్చును" అని అర్జునుని ఉద్దేశించి పలికాడు.

అందులకు సమాధానమీయకుండా అర్జునుడు కృష్ణ భగవానుని ఉద్దేశించి "స్వామి, మీకు భిన్నంగా నేను జీవించలేను, మీరు నా ఆహ్వానము ననుగ్రహించి వచ్చారు కనుక వెంటనే నా రథమునధిరోహించ వలసింది" అని ప్రార్థించాడు. మరుక్షణమే భగవాన్ శ్రీకృష్ణుడు అర్జునుని రథముపై సాక్షాత్కరించాడు. ప్రవీరుడు నిరాశ చెంది "ప్రభూ కనీసం ఒక మారైనా నా సారథిగా ఉండకూడదా", అని చింతిల్లి అర్జునునివైపు తిరిగి "ఈరోజు మీ వీరత్వమునకు పరీక్ష" అన్నాడు.

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గత సంచిక తరువాయి) - సుశీలా ప్రసాద

వేడుక మొదలైంది. నిలువెల్లా అలంకరించిన గోపాలకృష్ణుని యశోదమ్మ గారాబంగా ఎత్తుకుని వచ్చి పసిడి పీఠం మీద కూర్చోబెట్టింది. ఒక్కసారిగా గొప్ప వెలుగుని చూస్తే కళ్లు జిగేల్మన్నట్లు అటే చూస్తున్న అవ్వ కళ్ళు మూతలు పడ్డాయి. ఎలాగో కళ్ళు తెరిచి బాలకృష్ణుని వంక చూసింది. వాని చక్కదనం అంతా పెద్ద సముద్రంలా ఉంది. అందులో కన్నుమిన్ను గానక ఎగిసిపడే తరంగాల వంటి శృంగారంతో కనువిందైన వాని బాలవేషం చూసి చూసి మురిసిపోయింది. అందరివాడైనవాడు, తనవారంతా వచ్చారన్న సంతోషంతోనేమో చిన్నిగోపబాలుడు చంద్రబింబంలాంటి ముఖంతో చిరునవ్వు చిందిస్తుంటే, ఆనంద రసంలో మునిగి తేలుతూ మైమరచిపోయింది అవ్వ. అందరివంక చూసి తనలాంటి తన్మయత్వమే అందరూ పొందుతున్నారనుకుంది.

ఎన్నెన్నో పాటలు పాడుతున్నారు. గంధాలు పూశారు, పూలమాలలు అలంకరించారు. ఆపైన హారతులిచ్చారు. చివరిగా అక్షతలు వేసి ఆశీర్వదించేందుకు వెడుతున్నారు. కానుకలిస్తున్నారు. బాలునితో కలిసి నవ్వుతున్నారు. అవ్వ మనస్సు తహతహలాడిపోయింది. ఒక్కసారంటే ఒక్కసారి దగ్గరగా వెళ్ళి చూడాలనే ఆశ నిలవనివ్వలేదామెను. లేచి అడుగు ముందుకేసింది. అప్పుడు చూసింది యశోదమ్మ అవ్వను. ఆవిడ కళ్ళల్లో అనుమానం, భయం కదిలాయి. ఎవరీ క్రొత్తావిడ? మేను వణికింది. "ఎవరునువ్వు", అని గట్టిగా అంటూ అవ్వ నడిచి వచ్చే దారికి అడ్డంగా నిలబడింది. "మాయలు మంత్రాలు నేర్చిన దానవా" అని కసిరినట్టడిగింది. అవ్వ కళ్ళలో నీరు తిరిగింది. "మాయలు మంత్రాలు చేయవచ్చిన వారిని మట్టుబెట్టిన మహానుభావుడైన నీ బిడ్డని ఒకసారి చూడవచ్చా, అంతే నమ్మా! అవన్నీ ఉంటే నీ పాపడి దగ్గరకే చేరుకోలేనే! ఒక్కసారంటే ఒక్కసారి నీ చిన్న తండ్రి దగ్గరకి వెళ్ళనీ. నన్ను నమ్ము", జాలిగా వేడుకుంటూ ప్రాధేయపడుతున్న అవ్వని చూస్తు అనుకుంది యశోదమ్మ 'ఏవైనా రాక్షస లక్షణాలుంటే అదే నాశనమవుతుందిలే మునుపు అలాగే జరిగింది గదా", అని అనుకుంటూ దారి వదిలింది. ఒక్కంగలో బాలుని చేరిందవ్వ.

నిలువెల్లా నగలతో అలంకరించి వాటి కాంతులు నలువైపులా వ్యాపిస్తుంటే పసిడి బొమ్మలా ఉన్న బాలకృష్ణుని సమీపించి, ముందుగా ముద్దులొలికే పాదాలవంక చూసింది. అరవిందాలంటి ఆ పాదాలు ఆనంద మకరందాన్ని ఆమెలో నింపాయి. ఆ క్షణానే "నీకోసమే చూస్తున్నానవ్వా", అన్నాడు చిన్ని కృష్ణుడు చిరునవ్వుతో. అవ్వ అవాక్కయి నిలబడింది. యశోదమ్మ ఆశ్చర్యంగా "అవ్వనెప్పుడు ఎరుగుదువయ్యా", అంది.

"అదేనమ్మా! ఆ కొసన ఎక్కడో కూచుని, ఎప్పట్నించో రావాలని అనుకుంటున్నది. ఇప్పటికి వచ్చింది. "అంతేగదవ్వా! నేను చూస్తూనే ఉన్నానులే", అన్నాడు లీలా కిశోరుడు. ఇంకా "అందరూ అన్నీ తెచ్చారు నాకోసం. నువ్వేమీ తీసుకురాలేదా? తెచ్చినా దాచుకుంటున్నావా", బాలుని మాటలు వింటూ విస్తుపోతున్నది అవ్వ.

"అవ్వా! చిన్నవాడిని గదా! తినాలనుంది. అదిగో నీ చీరె చెంగున ఏదో ఉంది. ముడివిప్పులే, సిగ్గుపడకులే, ఏ కొంచెమైనా చాలు నాకు", అని మళ్ళీ అనేసరికి అవ్వ మొహమాటపడుతూ మూటవిప్పింది. నిగనిగలాడుతున్న నేరేడుపళ్ళు, ఎర్రని చిట్టీతపళ్ళు చూపిస్తూ అవ్వ "నాయనా! పేదరాలిని. వచ్చేదారిలో చెట్ల క్రింద ఏరి నాలుగు పళ్ళు నోట్లో వేసుకుని మిగిలినవి చెంగున కట్టుకున్నాను. ఇవే నీకిచ్చే కానుక", అవ్వ కళ్ళనిండ నీళ్ళు.

బుల్లి బుల్లి వేళ్ళతో వాటిని తీసుకుని నోట్లో వేసుకుంటూ "ఎంత తియ్యగా ఉన్నాయనీ! ఇవే నాకిష్టం సుమా! అందుకే ఇలాంటి ప్రియమైన కానుక తెచ్చిన అవ్వా! నీకేం కావాలి", అన్నాడు ప్రేమగా కన్నయ్య.

రుద్ధకంఠంతో "నువ్వే కావాలి నాయనా" అంది. ఆనంద బాష్పాలు కురుస్తున్న అవ్వ కళ్ళకు పరంధాముని అభయహస్తముద్ర లీలగా కనిపిస్తోంది. గగనభాగాన నిలిచిన దేవతలంతా 'తథాస్తు' అంటున్నారు.

చక్కదనమును మించిన శృంగారముతో, సంతోషంతో కలిగిన ముఖ చంద్రబింబములోని చిరునవ్వుతో వెలిగే బాలరూపుని ఆనంద రసవాహినిలో నా మనస్సు తేలియాడుగాక!

-సశేషం

# మౌనధ్యాన సప్తాహశిబిరం

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

మరీ 'సీరియస్'గా ఉంది కనుక ఒక కథ చెప్తాను. మీ అందరికీ తెలిసిన కథే. మొదలు పెట్టగానే మీరందరు ఎక్కడ, ఎప్పుడు, ఎవరు చెప్పారు అని మీరనుకుంటారని నాకు తెలుసు. పోనీ అలాగే వెతుక్కోండి. వెతికి చూడమన్నారుగా.

ఒక సాధువుగారు పురాణం చెప్తున్నాడు. ఒకాయన రోజూ పురాణం దగ్గరకు వచ్చి చాలా బాగా వింటున్నాడు, గురువుగారి దగ్గర. రోజూ ప్రవచనాలు చేస్తుంటే ఆ సాధువుగారి దగ్గరికి ఎవరు వచ్చినా రాకపోయినా, అతను మాత్రం తప్పకుండా ముందే వచ్చి కూర్చుంటున్నాడు, మీ అంత బుద్ధిమంతుడిలాగ. ఇవ్వాళ కూడ ధ్యానం క్లాసు కనుక మీరందరూ చిక్కుతున్నారు. ధ్యానం క్లాసు లేకపోతే చిక్కుతారా? అందుకని కష్టపడుతున్నారేమో అనుకున్నానుకాని, కనీసం ధ్యానం క్లాసులో అయినా ఇంతమంది కనిపిస్తుంటారు, చక్కగా- చూస్తున్నాను ఎవరెవరు ఎక్కడ ఉన్నారో

అయితే పాపం రోజూ ముందే వచ్చేవాడు. వచ్చి, రోజూ ఒకే టైమ్‌కు వెళ్ళి పోయేవాడు. పురాణం పూర్తి అవనీ, అవకపోనీ. రోజూ టైము ముందే వచ్చేవాడు కానీ, ఒక టైము పెట్టుకున్నాడు. 6గం॥లకు ముందే వచ్చేవాడు. ఈ సాధువుగారి ప్రవచనం 6గం.ల నుండి 7గం.30ని.ల వరకు జరిగేది. ఏడున్నర తరువాత ఆయన ఇంకా విశ్లేషణ చేస్తున్నప్పటికీ అతడు ఏడున్నరకు ఠంచన్‌గా లేచి వెళ్ళిపోతూ ఉండేవాడు.

ఈయన చూస్తే రోజూ నేను రాకముందే వస్తున్నాడు, కాని చెప్పటం పూర్తి అవకముందే ఎందుకితడు ఏడున్నరకల్లా వెళ్ళిపోతున్నాడు? నిజంగా శ్రద్ధ కలిగినవాడి మీద ధ్యాస పుడుతుంది కదా కొంచెం. సాధువుగారు చూశారు, చూశారు, రోజూ ఏడున్నరకు ఒక్క నిమిషం కూడ దాటకుండా లేచి వెళ్ళిపోతున్నాడు. పాపం ఆయనకు అతడిమీద జాలి కలిగింది."నాయనా! నిన్ను చూస్తే నాకు చాల ఆనందం కలుగుతుంది. కాని, జాలి కూడ వేస్తోంది. ఎంత ఠంచన్‌గా వస్తున్నావో నీవు. నీలాగా అంత కరెక్ట్‌గా టైమ్‌కు ఎవ్వరూ రావటం లేదు. చాలా బాగా వస్తున్నావు నాయనా, కాని నీవు ఎందుకు ఏడున్నర

అయ్యి అవకుండానే నువ్వు లేచివెళ్ళిపోతున్నావు?ఇంకా చాలా విశ్లేషణ ఉన్నది. గొప్పగొప్ప భావాలు వసున్నాయి అక్కడ. ఎందుకయ్యా అలా లేచి వెళ్ళిపోతున్నావు'', అని అడిగాడు.

"నాకోసం ఇంటిదగ్గర నా దారాపుత్రాదులు, అమ్మా, నాన్న వీరందరూ ఎదురు చూస్తుంటారండీ. నేను వెళ్ళకపోతే వాళ్ళు ముద్ద ముట్టరు. వాళ్ళకు నామీద అంత ప్రేమ! అందుకోసమని ఠంచన్‌గా వెళ్ళిపోతున్నాను'', అన్నాడు.

అంటే ఎలా ఉంది అక్కడ? నీవు తినే తిండికంటె ప్రవచనం గొప్పది అని కదా చెప్పుకుంటున్నాము. నీవు ఎలా తినాలి అనేది కూడ ప్రవచనంలో చెప్తేనేకదా నీకు తెలిసింది. అన్నంలో నీవు పొందవలసింది ఏదో చెప్తేనేకదా నీకు తెలిసింది. మరి ఇంత గొప్పవాక్యం చెప్తూంటే కూడ ఆయన సరిగ్గా ఏడున్నరకు వెళ్ళిపోతున్నాడంటే, అక్కడ ఎంత బలవత్తరమైన మమకారభావము. నావాళ్ళు నాకోసం ఇంతమంది ఎదురుచూస్తున్నప్పుడు, వాళ్ళంత సమయం నాకు కేటాయించారు కాబట్టి నేను ఏడున్నరకు వెళ్ళలేనా, అని లేచి వెళ్ళిపోతున్నాడు ఆయన.

సాధువుగారు ఒక కిటుకు వేశారు. "నాయనా! నీమీద అంత ప్రేమా వాళ్ళందరికీ'', అని అడిగాడు. "అయ్యో! ఎంత ప్రేమండీ! చాలా ప్రేమండీ నేనంటే వాళ్ళకు. ఇంతా అంత ప్రేమ కాదండీ! నేను లేకపోతే అసలు భోజనం చేయరు. నేను లేకపోతే టిఫిన్ తినరు. నేను వచ్చేవరకు అలా నాకోసం ఎదురు చూస్తారు. వాళ్ళకు పాపం ఇంకా టైమ్ దాటనివ్వటం మంచిది కాదు గదా! అందుకోసం'', అన్నాడు.

సాధువు, "అలాగా నాయనా! అంత ప్రేమా నీమీద? అయితే, ఆ ప్రేమ ఏమిటో నీవు ఒకసారి చూద్దువుగాని. ఏమీలేదు నేను ఒక చిన్న మందిస్తాను నీకు. ఆ మందు నీవు పుచ్చుకో. పుచ్చుకున్న తరువాత నీవు చనిపోయావనుకుంటారు కాని నీకు అంతా తెలుస్తూనే ఉంటుంది, ఆ తరువాత ఏం జరుగుతుందో చూడు'', అన్నారు. సరే సాధువుగారు ఆ మందు కాస్త ఇచ్చారు.

ఇప్పుడు కూడా ఇస్తారు సుమా! జాగ్రత్త! ఎవరి ప్రేమ ఎంతో తెలుస్తుంది. పాపం వెళ్ళి పుచ్చుకున్నాడు ఆయన. పుచ్చుకున్న తరువాత ఆయనకు అంతా తెలుస్తున్నది.

-సశేషం

# శ్రీ బాబూజీ దివ్యవాణి

శ్రీకృష్ణుడు మామూలు మానవ శిశువులవలెనే జన్మించాడని కొందరు అంటారు. ఆయన జన్మించలేదు, అవతరించాడని కొందరంటారు. ఈ రెండూ నిజమే. అదేవిధంగా కొంతకాలం ఆయన ఈ భూమండలంపై జీవించి, స్వర్గస్థుడయాడని కొందరి భావన. ఆయన మరణించలేదని మరికొందరి భావన. ఈ రెండూ యదార్థాలే. ఆయనకు ఎనిమిదిమంది పట్టమహిషులని, వేలాదిమంది గోపభామలు ప్రియురాళ్ళని కొందరంటారు. మరి కొందరు ఆయన 'అస్ఖలిత బ్రహ్మచారి' అని అంటారు. ఈ రెండూ నిజమే.

ఇదెలా సాధ్యం? పరస్పర విరుద్ధమైన రెండు తత్వాలు ఒకేచోట ఎలా సంపుటీకరింపబడతాయి? శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద బాబుగారు కృష్ణాష్టమి ఉత్సవాల సందర్భంగా యిచ్చిన సందేశంలో ఈ ప్రశ్నలకు సమాధానాలు సుబోధకం చేశారు. ఆయన సమాధానం యిలా సాగింది.

కంసుని కారాగారంలో దేవకి ప్రక్కన ఆయన కనిపించాడు. అంటే ఆయన జన్మించాడని అర్థం. ఆయన ఎన్నో సంవత్సరాలు జీవించాడు. ఎనిమిదిమందిని వివాహం చేసుకున్నాడు. వేలాదిమంది స్త్రీలు ఆయనను ప్రేమించారు. బోయవాడు వేసిన బాణం దెబ్బ తగిలి ఆయన మరణించాడు.

కాని కృష్ణ శబ్దానికి అర్థాన్ని మనం మననం చేసినట్లయితే కృష్ - అజ్ఞానం, న - నస్యతి అని అర్థం వస్తుంది అంటే అజ్ఞానాన్ని అంతం చేసి, జ్ఞానాన్ని ఇచ్చేవాడని భావం. ఈ దృష్ట్యా చూస్తే ఆయన జన్మించలేదు, మరణించలేదు. జ్ఞానికి జనన మరణాలు లేవు. ఆయన శాశ్వతుడు, ఆయన సర్వాత్ముడు. చరాచర సృష్టిలో ఆయన అంతర్యామి. జడ ప్రపంచంలోనూ, చైతన్య సృష్టిలోనూ ఆయన ప్రేమతత్వాన్ని స్పందింపచేశాడు. అదే వేలాదిమంది స్త్రీల ప్రేమ తత్వానికి సంకేతం. మహిళలే అనేమిటి? పశు పక్ష్యాదులు, క్రిమి కీటకాదులు ఒకటేమిటి అన్నీ ఆయన పంచిన ప్రేమామృతాన్ని గ్రోలినవే. అన్నీ ఆయనను ఆరాధించినవే.

అసలు ప్రకృతే ఆయన, ఆయనే ప్రకృతి. అందుచేత ఆయనను మనం ప్రేమించాలి. ఆరాధించాలి. ఆయన కోసమే, జీవించేటంతగా తాదాత్మ్య

భావనతో ఆరాధించాలి. పాండవులు, భీష్ముడు, విదురుడు, అక్రూరుడు, ఉద్ధవుడు, మరెందరో ఆయనను ఈ విధంగానే ఆరాధించారు. వారందరూ ఆత్మోపలబ్ధిని పొందారు. అయితే ఆయనను సామాన్య మానవుడుగా పరిగణించి స్త్రీ లోలుడుగా నిందించిన వారున్నారు. అనేక విధాలుగా ఆయనపై అభాండాలు వేసినవారున్నారు. కౌరవులు, శిశుపాలుడు, దంతవక్రుడు వంటి ఎందరో కృష్ణ దూషణ చేసినవారే. వారి పాపాలు పండాయి. ఫలితం అనుభవించారు.

అర్జునుడు, దుర్యోధనుడు కృష్ణుని సహాయాన్ని అర్థించి వెళ్ళారు. వారికి ఆయన అగ్నిపరీక్ష పెట్టాడు. ఆయన తన బలగాన్ని రెండు భాగాలుగా చేశాడు. అందులో ఒక వంతు తాను మాత్రమే. రెండవభాగం గోపాలక సైన్యం. అర్జునుడు గోపాలకుణ్ణి కోరుకున్నాడు. ఎటువంటి సంకోచం లేకుండా తనకు సారథ్యం వహించమని కోరాడు. దుర్యోధనుడు ఉపశాంతి పొంది గోపాలక సైన్యాన్ని కోరుకున్నాడు. తనవెంట తీసుకువెళ్ళాడు. ఒక్క మాటలో చెప్పాలంటే 'చెరకు' యిస్తానని అంటే అర్జునుడు 'ఇక్షురసాన్ని' కోరుకున్నాడు. ఫలితం అందరికి తెలిసనదే. విజయలక్ష్మి పాండవుల్ని వరించింది. కౌరవులు సర్వనాశనం అయారు.

అందుచేత మన ఆరాధనను కృష్ణునిపై లగ్నం చేయాలి. ఆయన ఈనాడు ఎక్కడ ఉన్నాడు, అని ఎవరైనా అడగవచ్చు. సమాధానం చాలా సూక్ష్మమైనది. ఆనాడు ప్రహ్లాదుడు చెప్పినట్లు "అందు గలడిందు లేడని సందేహము అవసరం లేదు." అయితే కనిపించడేం? అంటే ఆయన దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించవలెనంటే అందుకు తగిన శ్రద్ధాభక్తులు, సాధన మనకు ఉండాలి. ఆయనను దర్శించే అంతశ్చక్షువును ప్రదీప్తం చేయాలి. ప్రతి వస్తువులోనూ ఆయన కనిపిస్తాడు.

ఇందుకుగాను అందరినీ ప్రేమించడం నేర్చుకోవాలి. అందరిచేత ప్రేమించబడాలి. ఇది కష్టం అనుకొంటే సూక్ష్మమార్గం ఉంది. దేవుడు సర్వవ్యాపకుడు. మహాత్ములలో ఆ విభూతి ఉంది. మహాత్ములను, బ్రహ్మజ్ఞానులను చేరినట్లయితే భగవానుని ప్రేమామృతం అందుతుంది. జ్ఞాని, భగవంతుడు ఒక్కరే. ఈ మాటనే భగవానుడు **"జ్ఞానీత్వాత్మైవ మే మతమ్"** అని ఉద్ఘాటించాడు. *

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

'అహం బ్రహ్మోzస్మి' అనే మహా వాక్యానికి అర్థం యిదే. దీనికి వివరణములే, 'ఏకమేవాzద్వితీయం బ్రహ్మ', 'సర్వం ఖల్విదం బ్రహ్మ', 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ', 'నేహ నానాz స్తి కించన' అనే లక్షణ వాక్యములు" అని అరటి పండు ఒలిచి యిచ్చినట్లు ఆత్మ తత్త్వమును వాళ్ళకు వివరించారు.



అలా వారిరువురికి స్వప్నంలో తమ రాకను గూర్చిన ప్రబోధమును కలిగించి, తమకు తామై వచ్చి, వారి జీవితములకు ధన్యతను చేకూర్చగల ఆత్మ బోధను అందించారు శ్రీ బాబు. వారి నిర్హేతుక జాయమాన కరుణా కటాక్షమునకు శతధా కృతజ్ఞులై, వారిరువురు శ్రీ బాబుకు పాదాభివందనం చేసుకున్నారు. "సాధన సంపూర్ణ ఫల సిద్ధిరస్తు", అని శ్రీ బాబు వారిని ఆశీర్వదించి వెళ్ళిపోయారు. ఆ తరువాత కృష్ణమూర్తి గారికి, పరశురామయ్యగారింట్లో మళ్ళీ శ్రీ బాబు దర్శనం లభించింది.

ఆ విధంగా దిరుసుమర్రు గ్రామానికి శ్రీ బాబుతో ప్రధమ పరిచయం లభించింది. అప్పటి నుండి కృష్ణమూర్తి గారు, నారాయణరాజు గారు శ్రీ బాబుకు అత్యంత సన్నిహిత భక్తులైనారు. ఇద్దరూ అర్థరాత్రి వేళ భీమవరంలోని మామిళ్ళమ్మవారి సన్నిధిలో ధ్యానం చేసుకుని ఎన్నో అనుభవాలను పొందారు.

## గుండుగొలను

గురుదేవుని స్పర్శవేదితో పోలుస్తారు. కాని, అది అసమగ్రమైన పోలిక. నిజానికి గురుదేవునితో పోల్చదగినది రెండవది ఏదీ లేదు. **"న ద్వితీయోzస్తి కశ్చిత్"** ఎందుకనగా, స్పర్శవేది తాను తాకిన దానిని బంగారంగా మార్చగలదే గాని, తనవలె మరొక స్పర్శవేదిగా మార్చలేదు. కాని గురుదేవుల అభయ ప్రదానానికి పాత్రుడై , గురు పరమానుగ్రహాన్ని పొందిన మానవుడు, తాను

కూడా గురు స్వరూపుడై ప్రకాశించ గలడు. శిష్యుడు తనలోనూ, సర్వత్రా గురు స్వరూపమునే దర్శించి తదనుభూతిని పొందేవరకు, ఆ శిష్యుని **'త్వమేవాzహం'** అంటూ తమ అక్కున చేర్చుకొనే వరకు, సత్య గురువులు తమ శిష్యులను విడువరు. అది సమర్థ సద్గురు దేవుల విశిష్టత.

పూజ్య శ్రీ బాబూజీ పవిత్ర పాద స్పర్శతో పునీతములైన గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఆ దివ్య పాద రజః ప్రభావము ఆయా గ్రామ వాసులను, పరిసర ప్రాంతాల వారిని ఆస్తిక సంపన్నులు గాను, ఆధ్యాత్మిక పథానురక్తులు గాను చేసి, ఆ గ్రామాలను పుణ్యధామాలుగా మార్చి వేసింది. అటువంటి గ్రామాలలో గుండుగొలను ఒకటి. శ్రీ బాబు ఏకచ్ఛత్రాధిపతులై పాలించిన అద్వైత సామ్రాజ్యానికీ, ఆత్మ జ్ఞాన సంపదకూ వారసురాలై, ఆ సంపదను దేశ విదేశాలలోని అశేషమానవకోటికి అందించి, శ్రీ బాబు అవతార లక్ష్యమైన విశ్వశాంతినీ, లోక కళ్యాణాన్నీ సాధించటానికి రూపము ధరించి వచ్చిన జగజ్జనని, ప్రస్తుత శ్రీ కాళీ వనాశ్రమాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ (కుమారి చంద్రశేషమాంబ, తండ్రి మావులేటి చిరంజీవిరాజుగారు, తల్లి రాఘవమ్మగారు) జన్మ స్థలమిది.

పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు పట్టణానికి దగ్గరలో ఉన్న గుండుగొలను గ్రామానికి సమీపంలో పాతూరు అనే చిన్న గ్రామం ఉన్నది. ఆ గ్రామంలో వెజ్జు వెంకయ్యగారనే రైతు ఉండేవారు. వెంకయ్యగారు ఒకరోజు తమ పొలంలో పని చేసుకుంటూ ఉండగా, శ్రీ బాబూజీ వారికి షోడశ వర్ష ప్రాయుడైన దివ్య మూర్తిగా దర్శనమిచ్చారు. ప్రథమ దర్శనంలోనే వారిని మహాత్ములుగా గుర్తించి, శ్రీ వెంకయ్యగారు వారిని తమ యింటికి తీసుకుని వెళ్ళారు.

ఆ రోజులలో పాతూరులో ప్రతి రోజూ కొన్ని భయంకర సంఘటనలు జరిగేవి. ఉన్నట్లుండి గడ్డివాములు, దండెం మీద ఆరవేసిన బట్టలు, యిళ్ళు, వాటంతట అవే తగలబడిపోతూ ఉండేవి. ఏ కారణమూ లేకుండా అలా జరుగుతున్న దానిని బట్టి, ఏదో ఒక పెను భూతం ఆ గ్రామాన్ని పట్టి పీడిస్తున్నదనే భయం ఆ గ్రామ ప్రజలకు పట్టుకున్నది. వెంకయ్య గారు శ్రీ బాబుతో ఈ విషయం చెప్పి, తనకున్న కొద్దిపాటి సంపదకు ఏమి ముప్పు కలుగుతుందో అని భయపడగా, శ్రీ బాబు "నీకు ఎటువంటి కీడూ జరగకుండా నేను చూసుకుంటాను. భయపడకు" అని అభయమిచ్చారు.

-సశేషం

# అమెరికాలో శ్రీ మాతాజీ

(గత సంచిక తరువాయి) -పద్మజ U.S.A

శ్రీమాతాజీ బోధని కొనసాగిస్తూ భగవంతుణ్ణి ఆశ్రయించిన వాడికి మాయ అంటే భయం ఎందుకు? స్వామిని శరణం పొందినవాడికి మాయను గురించి భయపడవలసిన పని ఏమున్నది? మనస్సుతో కూడిన ఈర్ష్య, అసూయ, కామక్రోధాది గుణాలు మాయ ద్వారా వచ్చినవే. మాయ చాల గొప్పదే. మాయ మాయ అని జపం చేస్తే ఏం లాభం? దానికి కారణం మనోభావన.

కురుక్షేత్ర సంగ్రామానికి ముందు శ్రీకృష్ణభగవానుని సహాయార్థం దుర్యోధనుడు ముందుగానే వెళ్ళాడు. "నేను రారాజును తల వంచుతానా", అని కృష్ణభగవానుని ఇంట్లో ప్రవేశించాడు.

గుమ్మం చాలా చిన్నది. తల వంచక తప్పదు. తలవంచకుండా వెళ్ళిన కారణంగా దుర్యోధనుని కిరీటం దొర్లుకుంటూ వెళ్ళి శ్రీకృష్ణుని పాదాల చెంత నిలిచింది. ఎలాగో ఎవరూ చూడలేదులే అని సమాధాన పరచుకుని కిరీటాన్ని తన శిరస్సుపై పెట్టుకుని శ్రీకృష్ణుని పాదాల వద్ద కూర్చోవటానికి ఇష్టపడక తల వద్ద కుర్చీ వేసుకుని కూర్చున్నాడు.

ఇంతలో అర్జునుడు వచ్చాడు. వచ్చి శ్రీకృష్ణ పరమాత్ముని పాదాల చెంత కూర్చున్నాడు. భగవంతుని వద్ద సంపూర్ణ శరణాగతిని పొందాలి. అర్జునుడు అలా చేశాడు కనుక విజయుడయ్యాడు.

మరి మాయ ఇరువురిలో ఎవరిని వశం చేసుకుంది? దుర్యోధనుని మనోభావనే మాయ. అదే అతని పతనానికి హేతువయింది.

మాటలతో తోటి మానవుల మనస్సు నొప్పించరాదు. గురుదేవుని ముఖకమలం నుంచి వచ్చిన మాటలను విని, పాద కమలంలోని మకరందాన్ని తీసుకోవాలి. భగవంతుడు అవ్యక్తంగా ఉన్నా ఆయన దయని అందజేస్తూనే ఉన్నాడు. కాని మనము మనస్సుని అడ్డం పెట్టుకొని దానిని అందుకోలేక పోతున్నాము.

ఎంతోమందిని బ్రతిమిలాడి, ప్రాధేయపడి పనులు చేయించుకోవటానికి వెనుకాడరు. కాని నీ మనస్సుని బ్రతిమిలాడు

నీ మార్గానికి మరల్చుకోవటానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి? ఎవరి వలన భయపడక, ఎవరికి భయము, దుఃఖము కలిగించనివాడు నాకు ప్రియుడు అని భగవానుడు అన్నాడు. భగవద్భావనతో సాధకుణ్ణి గుర్తించి, ఆహారం తీసుకోవాలి. నీ మనస్సు చేసే దోషాన్ని నీవే హెచ్చరించుకోవాలి.

ఒక బిచ్చగాడు ఒక గృహం ముందు నిల్చొని ,"అయ్యా! దాహం వేస్తోంది. కాస్త మంచితీర్థం ఇప్పించండి", అని అర్థించాడు. ఆ ఇంటి యజమాని పూజలో నిమగ్నమై ఉన్నాడు. "పూజలో ఉన్నాను. పూర్తికాగానే నీకు తీర్థము, ప్రసాదము అందజేస్తాను వేచి ఉండు",అన్నాడు.

గంట వినిపించింది. పూజ పూర్తి అయిందని భావించాడు. పూర్తి కాలేదు. 16మంది దేవతలకూ పూజ చేశాడు. 16 పర్యాయాలు గంటలు వినిపించాయి. ప్రతిపర్యాయము బిచ్చగాడు గంట వినిపించినప్పుడు ఆ యజమాని గృహము వెలుపల ఒక గొయ్యి తీయటం ప్రారంభించాడు. పూజ పూర్తి చేసుకుని తీర్థ ప్రసాదములు తీసుకుని యజమాని వచ్చేసరికి తన ఇంటి ముందు 16 గోతులు తీసి ఉన్నాయి.

వెంటనే యజమాని బిచ్చగాడిని ఉద్దేశించి మాట్లాడుతూ "అదేమిటయ్యా! అలా చేశావు? అలా 16గోతులు తీసి కాలాన్ని వృథా చేసేబదులు ఒకే పెద్ద గొయ్యి తీసిఉంటే నీ దాహాన్ని తీర్చే జలము లభించి ఉండేది కదా", అన్నాడు.

దానికి బిచ్చగాడు స్పందిస్తూ, "స్వామీ! అదే నేనూ ఆలోచిస్తున్నాను. మీ విలువైన కాలాన్ని 16మంది దేవతలను అర్చించటానికి వినియోగించారు. అలా కాకుండా ఏకాగ్రతతో సమస్త దేవతా స్వరూపుడైన సద్గురుమూర్తిని అర్చించటానికి ఆ సమయాన్ని వినియోగిస్తే దైవ దర్శనం పొందేవారుకదా", అని హెచ్చరించాడు.

"నామ స్మరణ మరవకుండా మనస్సు ఎన్నివిధాల సంకల్పించినా చింతలేదు. పూర్వజన్మ వాసన ద్వారా కల్గిన సంకల్పాన్ని వదిలించుకుని బయటపడటం ఉత్తమం. దానికి బంధింప బడకుండా చూసుకోవాలి. అది పురోగతికి తీసుకు వెళ్తుంది", అన్నారు మాతాజీ.*

# మారనిది ఏది?

-మేధ

శ్రీబాబూజీ మహరాజ్ రాజమండ్రి జయంతులు నిర్వహించే సమయంలో తుని నుంచి దేవళ్ళగారితో వారి బంధువర్గానికి చెందిన సుందర రావుగారు కూడా వచ్చారు. పూజ కార్యక్రమాలు అయిపోయిన తరువాత వారంతా కలిసి తిరుగు ప్రయాణ సన్నాహాలలో ఉన్నారు.

శ్రీబాబు వద్ద శలవు తీసుకుని వెళితే మనకి అన్నివిధాలా బాగుంటుందని దేవళ్ళగారు వారందరినీ హెచ్చరించారు. అదేమిటండీ అనుదినము శ్రీబాబుగార్కి నమస్కారము చేసుకుంటున్నాము, తీర్థం తీసుకుంటున్నాము, ప్రసాదం స్వీకరిస్తున్నాము. ఇంకా శలవు తీసుకోవటమేమిటి, చాదస్తము కాకపోతే అనే సంభాషణ కొనసాగింది.

దేవళ్ళ గారు వాళ్ళని హెచ్చరిస్తూ, "అలా అనవసరమైన మాటలు మాట్లాడకండి. చాలా తప్పు. దానివలన మనమే నష్టపోతాం. మనం వ్యాపారం చేసుకునే వాళ్ళం. రెండురోజుల క్రితమే కదా సేల్స్‌టాక్స్ వాళ్ళు వచ్చి నానా గొడవ చేసి వెళ్ళారు",అన్నారు. వారంతా చివరికి శ్రీబాబుగారి దగ్గర శలవు తీసుకుని ప్రయాణం కొనసాగించటానికి నిర్ణయించుకున్నారు.

శ్రీబాబు వారందరినీ ఆశీర్వదించి, ఆపిల్ పండ్లు ప్రసాదంగా అందజేశారు. సుందరరావుగారు శ్రీబాబుగారు ఇచ్చిన ఆపిల్‌పండును తన బ్యాగ్‌లో పెట్టుకొని మరచిపోయారు. రెండు నెలల తరువాత చూసుకుంటే ఆపిల్ పండు పాడవలేదు. అలానే ఉంది. సుందరరావుగారు శ్రీబాబుగారిని కలసి,"తమరు రెండు నెలల క్రితం ఇచ్చిన పండు అలానే ఉంది. మార్పులేదు", అని సంతోషంగా చెప్పారు.

శ్రీబాబు మాట్లాడుతూ,"మీరు కూడా మారకుండా అలాగే ఉన్నారా! కానీ మీలో మార్పు చెందనిది ఒకటి ఉన్నది. మీ దేహంలో మార్పు రావచ్చు, మీ ప్రవర్తనలో మార్పు రావచ్చు. మీ భావనలో మార్పు ఉండవచ్చు. కాని, మీలో మారనిది ఒకటి ఉన్నది. దానిని తెలుసుకోండి. అదే మీ దేహాన్ని ప్రకాశింపజేసే వస్తువు. అది శాశ్వతమైనది. దానిని మీరు గుర్తించిన నాడు మీరు ఆపిల్ రెండు నెలలైనా మారలేదని ఎంతసంతోషంతో నాకు చూపించటానికి తీసుకువచ్చారో అంతకి వందరెట్లు నేను సంతోషిస్తాను", అన్నారు. *

# మన సాధన ఎందుకు ఫలించటం లేదు?

(గత సంచిక తరువాయి) -వెంకట రమణ ప్రసాద్

వారు శివుని మారువేషము గుర్తింపలేదు సరికదా, "వీడు అశుచి. కపాలము పట్టుకుని మనలను మైలపరచుటకు వచ్చినాడు. వీనిని తరిమివేయ వలెను", అని వానివైపు కోపముతో, తిరస్కారముతో చూచిరి. కాని శివుడు వారిని చూసి కదలలేదు. వారి తిరస్కారమును శివుడు లెక్కచేయలేదు.

కొంతమంది విద్వాంసులు ఉండబట్టజాలక శివుని బయటకు నెట్టివేయ వలెనని తలచిరి. కాని ఆయనను తాకుట ఎట్లు? తాకినచో తాము మైలపడుదురు కదా! అయిననూ కొంతమంది ఒక గుంపుగా చేరి, ఆతనిని నెట్టివేయవలెనని నిర్ణయమునకు వచ్చిరి. వారి ప్రయత్నమును గుర్తించిన దేవదేవుడు తన వద్ద నున్న కపాలమును నేలపై ఉంచి, తాను పాకశాలవైపుకు నడచెను.

కపాలమపవిత్రము కదా! దానిని తాకుట ఎట్లు? అచ్చటనున్న బ్రాహ్మణులకది ఒక సమస్య అయినది. వారిలో ఒక సాహసి, "మీరందరూ నాకు ధనమిచ్చినచో నేను దానిని తీసివైచెద"ననెను. దీనికందరూ ఒడంబడిరి.

వెంటనే ఆ బ్రాహ్మణుడు తాను చేతితో కపాలమునెత్తి దూరముగా పారవేసెను. ఇంతలో ఆశ్చర్యముగా మొదటి కపాలము స్థానములో ఇంకొకటి యుండెను. దానిని తొలగింపగా మరియొకటి.... మరియొకటి.... అనంతముగా కపాలములు పుట్టుకొని వచ్చుచుండెను. అది గమనించిన ఆ విద్వాంసులు అందరూ, "ఆ వచ్చిన వాడు సామాన్యుడు కాడు, పరమశివుడే అయి ఉండవలెను", అని నిర్ణయమునకు వచ్చి తమ విద్యామదమునకు పశ్చాత్తాపపడి, యజ్ఞశాలలో నున్న మహాదేవుని పాదములపై పడి, క్షమాపణము కోరగా, శివుడు వారిని అనుగ్రహించెను.

## ధనమదము -

ప్రతిమానవుని జీవితములోను ధనమదమును గూర్చిన అనుభవములు అనేకములుండును. ధనముండీ ధనమదములేనివారు అరుదు. అందుచే ముముక్షువులు ధనమదము నుండి విముక్తులు కావలెను. విశిష్టాద్వైతులు ఈ మూడు మదముల నుండి (ఆభిజాత్య, విద్యా, ధన

మదములు) విముక్తిని పొందనివారికి తత్త్వోపదేశముకాని, మంత్రోపదేశమును కాని చేయరు. ఈ మదత్రయమునే ఇతర మతములవారు గర్వత్రయము అందురు. భగవద్రామానుజుల విషయమున ఈ మదత్రయము ఎట్లు నిరూపింపబడినదో శ్రీ మట్టిబోయిన రామ సుబ్బయ్యగారు తమ "బ్రహ్మజిజ్ఞాస'' అను గ్రంథములో (రెండవ భాగము) చక్కగా తెలియజేసినారు. ఈ కథ ప్రపన్నామృతము 22వ అధ్యాయముననున్నది. (పుటలు 8-10).

శ్రీరామానుజాచార్యులవారు భగవద్గీత 18-66వ శ్లోకమునకు రహస్యార్థమును తెలియగోరి గోష్ఠిపూర్ణుల (తిరుకొట్టియూరు నంబి) నాశ్రయించిరి. గోష్ఠిపూర్ణులు రామానుజులవారిని పదునేడు పర్యాయములు తమకడకు త్రిప్పుకొని పదునెనిమిదవసారి వచ్చినప్పుడు చరమశ్లోక తాత్పర్యమును చెప్పి, "దీనిని మదత్రయము ఉన్నవారికి చెప్పవలద''ని ఆదేశించిరి.

శ్రీరామానుజుల మేనల్లుడగు దాశరథి అనువారు చరమ శ్లోకార్థము నెరుంగగోరి శ్రీరామానుజులనాశ్రయించిరి. దాశరథి మదత్రయము గలవాడని తెలిసి రామానుజులు, వారిని గోష్ఠిపూర్ణులనాశ్రయింపుమని చెప్పిరి. గోష్ఠిపూర్ణుల కడకేగ వారు రామానుజుల కడకే పొమ్మనిరి. దాశరథి చేయునదిలేక రామానుజులకడకే వచ్చిరి. అట్టి సమయమున ఒక విశేషము జరిగెను. అది ఏమన.........

శ్రీరామానుజులవారి గురువగు మహాపూర్ణుల (పెరియనంబి) కుమార్తె యగు అత్తుళాయమ్మగారు వారి అత్తవారింట్లో అత్తవారుపెట్టు బాధలు పడలేక ఇంటి పనులు చేయలేక తండ్రిగారికి ఆ విషయము నివేదించుటకై వచ్చి, రామానుజులవారితో కూడ అచ్చట నున్న తండ్రిగారికి తన కష్టమును నివేదించెను. పెరియనంబిగారును, "నీ అన్నగారికి (రామానుజులవారికి) చెప్పుకొమ్మ''నిరి.

ఇదంతయు వినుచున్న రామానుజులవారు తమ యెదుట నిలచియున్న దాశరథిని చూచి, "నీవు అత్తుళాయమ్మగారింటికి వెళ్ళి దాసునివలె నీళ్ళు తెచ్చుట, వంటచేయుట మొదలగు పనులు చేయుచుండు''మని చెప్పిరి. దాశరథియూ వారి ఆజ్ఞను శిరసావహించి అట్లే చేయుచుండెను.

-సశేషం

# గురుశిక్షణ

- పద్మజ

గురుకుల వాసంలో ఉన్న ఇద్దరు శిష్యులను గురుమూర్తి పిలిచి, వారి శిక్షణ పూర్తి అయినదీ లేనిదీ తెలుసుకొనగోరి వారికి ఒక పరీక్ష నిర్వహించారు. ఇరువురు శిష్యులను అలా ఆశ్రమం నుంచి బయటకు వెళ్ళి బాహ్య ప్రపంచంలో సంచరించి రమ్మని ఆదేశించారు.

ఆశ్రమం నుంచి వెలుపలికి రాగానే బాహ్య ప్రపంచంలోకి వెళ్ళే దారి అంతా ముళ్ళకంపలతో నిండి ఉంది. ప్రయాణానికి కాలినడకన వెళ్ళటం అసంభవం. ఒక శిష్యుడు ఎలాగో బ్రతుకుజీవుడా, అంటూ ముళ్ళకంపలను దాటుకుంటూ అవి కాలికి గుచ్చుకున్న బాధని భరిస్తూ ఎలాగో వెళ్ళిపోయాడు.

రెండవ శిష్యుడు మాత్రం ఆ బాటలో ఉన్న ముళ్ళ పొదలన్నిటినీ నెమ్మదిగా తొలగించుకుంటూ కాలినడకన ప్రయాణం చేయటానికి శుభ్రపరచాడు. తనకి కేటాయించిన సమయాన్నంతా ఆ బాటను శుభ్రపరచటానికే వినియోగించాడు.

గురుమూర్తి వారికి అనుమతించిన కాలము పూర్తిఅయి పోయింది. ఇద్దరు శిష్యులూ గురుమూర్తిని సమీపించారు.

గురుమూర్తి ఇద్దరినీ ఉద్దేశించి మాట్లాడుతూ, "మీ ఇరువురిలో ఎవరు మీ లక్ష్యార్థాన్ని సాధించటానికి మీ మనస్సుని శుద్ధి చేసుకున్నారో వారికి శిక్షణ పూర్తి అయింది. వారు గురుకులం విడచి ఎక్కడికైనా వెళ్ళవచ్చు. అది ఎవరో మీరే నిర్ణయించుకోండి", మీరు పయనించే బాటని శుభ్రపరచుకుంటే మీ ప్రయాణం సుఖంగా జరుగుతుంది అన్న విషయం గ్రహించిన శిష్యుడే తన శిక్షణ పూర్తి చేసినట్లు ఋజువైనంది", అన్నారు. *

# పునీతవతి

ఆంగ్లమూలం- ఆర్. సంపత్,        తెలుగు అనువాదం - సుషుమ్నా ప్రసాద

క్రీ.పూ. ఆరవ శతాబ్దములో కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి 'కరైకాల్' అనే గ్రామమునందు ధనదత్తుడనే సంపన్న వర్తకుడు విదేశీ వ్యాపారము చేసేవాడు. అక్కడ ప్రజలందరూ ఆయన సంపదను గౌరవించేవారు. అంతకంటె మిన్నగా పరమ శివుని భక్తుడని మెచ్చుకొనేవారు. ధనదత్తునకు అద్భుత సౌందర్యరాశి, పరమశివుని మహాభక్తురాలగు 'పునీతవతి' అనే ఏకైక కుమార్తె కలదు.

పునీతవతికి యుక్తవయస్సు రాగానే ధనదత్తుడు తన పుత్రికకు తగిన వరుని కోసం, అన్వేషణ మొదలుపెట్టాడు. ఒకరోజు నాగపట్టణం నుండి నిధిపతి యనే సంపన్న వర్తకుడు 'కరైకాల్'కు ధనదత్తుని అతిధిగా వచ్చాడు. నిధిపతి పునీతను చూడగానే ఆ కన్య తన పుత్రుడు పరమదత్తునకు తగిన వధువుగా భావించాడు. వెంటనే ఆ విషయాన్ని ధనదత్తునితో ప్రస్తావించాడు. ధనదత్తుడు ఆనందంతో అంగీకరించాడు. కాని తనకు పునీతవతి యేకైక పుత్రిక కావటంతో ఒక నిబంధన పెట్టాడు. వివాహానంతరము పరమదత్తుడు తన వ్యాపారాన్ని నిర్వహిస్తూ కారైకాల్‌లో ఉండవలెనని. కానీ వారి స్వేచ్ఛకు భంగం కాకుండా వేరుగా ఉండటానికి పెద్ద భవంతిని నిర్మించి ఇస్తానన్నాడు. ఆ ప్రతిపాదనకు నిధిపతి వెంటనే అంగీకరించాడు.

వివాహానంతరము పునీతవతి, పరమదత్తుడు ఎంతో ఆనందంతో దాంపత్య జీవితం గడుపుతూ ఆ నగరానికంతటికి ఆదర్శదంపతులుగా వెలుగొందారు. ఒకరోజు అతని స్నేహితుడు కొట్టుకు వచ్చి, ఆనందంగా కాలక్షేపం చేసి, రెండు మామిడిపండ్లను బహూకరించి వెళ్ళాడు. ఇంకా భోజనసమయం కాకపోవటం వలన, పరమదత్తుడు మామిడిపండ్లను పరిచారకుని ద్వారా యింటికి పంపి, భోజనసమయంలో వడ్డించమని కబురు పంపాడు. పరిచారకుడు ఆ మామిడి పండ్లను పునీతవతికి అందజేశాడు.

అదే సమయంలో మరొక శివభక్తుడు పునీతవతి ఇంటికి వచ్చి, తనకు చాలా ఆకలిగా ఉన్నది, ఆమె భర్తవచ్చేదాకా ఆగలేనని, వెంటనే ఏదైనా ఆహారాన్నిచ్చి తన ప్రాణాలు నిలబెట్టమన్నాడు. అప్పటికింకా వంటకాలు తయారుకానందున ఆమె అందుబాటులో ఉన్న ఆహారపదార్థములను పునీత వడ్డించింది. ఆహారపదార్థములతోపాటు పరమదత్తుడు పంపిన మామిడి

పండ్లలో ఒక మామిడిపండును ఆ అతిథికి వడ్డించింది. ఆయన ఆమె ఆతిధ్యమునకు తృప్తిపడి, పునీతవతిని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్న భోజనమునకు ఇంటికి వచ్చిన పరమదత్తుడు తాను పంపిన మామిడిపండును వడ్డించమన్నాడు. అది చాలా మధురముగా ఉండటంచేత రెండవపండును కూడా వడ్డించమన్నాడు. పునీతవతి చిక్కులోపడి, వంటగదిలోకి వెళ్ళి "ఈ పరీక్షనుంచి ఎలా రక్షిస్తావో ప్రభూ!" అంటూ పరమశివుణ్ణి ప్రార్థించింది. కరుణానిధియైన పరమేశ్వరుడు ఆమెని ఆ క్లిష్టపరిస్థితి నుండి రక్షించటానికి మరొక పండును ప్రసాదించాడు. ఆమె ఆనందముతో ఆ పండును భర్తకు వడ్డించింది. ఆ పండు అంతకుముందు వేసిన మామిడిపండుకన్న, ఎంతో రుచికరంగా, మధురంగా ఉండటంతో పరమదత్తుడాశ్చర్య చకితుడై, 'ఆ పండు, తాను పంపిన రెండు పండ్లా ఒకటేనా'యని ప్రశ్నించాడు. ఎంతో శీలవతి, సత్యసంధురాలైన పునీతవతి అది పరమశివుడు ప్రసాదించిన ఫలమని జరిగిన విషయాన్ని పూసగుచ్చినట్లు చెప్పింది. ఆమె మాటలు విశ్వసించక పరమశివుని మరొక ఫలాన్ని ప్రసాదించమని ప్రార్థించమని పరమదత్తుడు కోరాడు. పుణ్యవతి ఆర్తితో, కన్నీటితో, పరమానుగ్రహముతో మరొక ఫలాన్ని ప్రసాదించమని వేడుకొన్నది. పరమాశ్చర్యంగా ఆమె దక్షిణహస్తంలో మరొక ఫలం ప్రత్యక్షమైంది. పరమదత్తుడా ఫలాన్ని తనచేతిలోకి తీసుకోగానే, ఆ ఫలమదృశ్యమైంది.

పరమదత్తుడా ఉదంతమును చూసి, తన భార్యకు భగవంతునికి, ఉన్న అనుబంధానికి చకితుడై, ఆమె నొక దివ్యస్త్రీగా భావించాడు. ఆమెతో ఐహిక సంబంధం పెట్టుకోవటం అపరాధంగా భావించాడు. ఆమె దివ్యత్వాన్ని ఆరాధించటం ప్రారంభించాడు. ఇంతలో పరమదత్తుడు అదను చూసుకుని తాను కరైకాల్ విడిచి వెళ్తున్నానని, కొంత కాలానికి తిరిగి వస్తానని చెప్పాడు. కాని అతను తిరిగి రాకుండా, పాండ్య దేశంలో సముద్రతీరాన ఒక నగరంలో ఉండిపోయి, అక్కడ మరొక వనితను వివాహమాడాడు. వారికొక ఆడశిశువు జన్మించినది. ఆ పాపకు 'పునీతవతి' అని నామకరణం చేశాడు.

అలా చాలా సంవత్సరాలు దొర్లిపోయాయి. ఎంతో ఆరాటంతో ఎదురు చూస్తున ధనదత్తునకు, పునీతవతికి ఏ కబురూ లేదు. ఇంతలో పరమదత్తుని పాండ్యదేశములో చూచిన వ్యాపారులు ఆ విషయాన్ని ధనదత్తునకు తెలిపారు. ధనదత్తుడు అల్లుడు ఇల్లరికం ఉండటానికి సిగ్గుపడి మరొక ప్రాంతానికి వెళ్ళాడని భావించాడు. ధనదత్తుడు తన కుమార్తెను అల్లుని

వద్దకు పంపాలని నిశ్చయించుకొన్నాడు. చాలా బహుమతులను తీసుకుని ఇరువురు పరమదత్తుని దగ్గరకు వెళ్ళారు. అక్కడ అతను మరొక యువతితో కాపురం చేయటం చూసి, ఆశ్చర్యపోయారు. పరమదత్తుడెందుకు తన పుత్రికను వదిలివేశాడని ధనదత్తుడు ప్రశ్నించాడు. దానికి పరమదత్తుడు సమాధానమిస్తూ 'అయ్యా! నేనామెను విసర్జించలేదు. ఆమెను దివ్యత్వంతో మూర్తీభవించిన దివ్యకాంతగా ఆరాధిస్తున్నాను. అలాంటి తేజోమూర్తిని నా భార్యగా భావించటమనేది మహాపరాధమని తలుస్తున్నాను' అన్నాడు.

అతని మాటలకు నిర్విణ్ణుడైన ధనదత్తుడు విషయమేమిటని పునీతవతిని ప్రశ్నించాడు. ఆమె మామిడి ఫలాల కథను వివరంగా చెప్పి, పరమేశ్వరుణ్ణి ఇలా ప్రార్థించింది 'హే ప్రభూ! నా అందాన్ని, యౌవనాన్ని, సర్వస్వాన్ని నా భర్తకే అర్పించాను. ఇప్పుడు ఈ సౌందర్యంతో నిమిత్తమేమున్నది? ఇతరపురుషులు నన్ను కోరుకోకుండా నన్నొక కురూపిగా మార్చు ప్రభూ!' అని ప్రార్థించింది. వెంటనే భగవంతుడు ఆమె ప్రార్థనకు ఆమోదాన్ని తెలిపి, పునీతవతిని ఒక భయానకమైన అస్థిపంజరంలా ఉండే కురూపిగా మార్చాడు. ఆమె తన తండ్రి అనుజ్ఞ తీసుకుని తాను ఇకపై సన్యాసి జీవితాన్ని జీవిస్తానని వెళ్ళిపోయింది.

ఆమె అనేక శివాలయములను దర్శించిన తరువాత, పరమేశ్వరుని తాండవ నృత్యాన్ని తిలకించటానికి కైలాస శిఖరాన్ని చేరుకొన్నది. కైలాస పర్వతం చేరుకొన్నాక తాను కైలాసగిరిని పాదాలతో అధిరోహిస్తే మహాపరాధమని భావించి, తన చేతులతో పర్వత శిఖరాన్ని అధిరోహించాలని అనుకొన్నది. నిరుపమానమైన ఆమె భక్తికి, పరమేశ్వరుడు పరవశించి ఈవిధంగా అడిగాడు, 'అమ్మా! నీవెందుకు ఇలా హింసించుకుంటున్నావు?' ఆ ప్రశ్నకు పునీతవతి సమాధానమిస్తూ 'హే ప్రభూ! ఒక్కసారి మీ తాండవ నాట్యాన్ని సందర్శించి, మీలో లయమైపోయే అదృష్టాన్ని ప్రసాదించండి' అన్నది.

ఆమె కోరికకు స్పందించి, పరమశివుడు పరమానందుడైనాడు. పునీతవతి చెన్నై, అరక్కోణం మధ్య ఉన్న తిరువాలంకాడుయనే గ్రామానికి వెళ్ళి, అక్కడ పార్వతీపరమేశ్వరుల తాండవ నృత్యాన్ని సందర్శించి, ఆనంద పరవశురాలైంది. తర్వాత కొంతకాలము శివక్షేత్రములను సందర్శించి, సదాశివునిలో లయమయింది.

భక్తులందరూ ఆమెను కరైకాల్ అమ్మవారని ప్రశంసించారు. ఆమెను పరమశివుని మహాభక్తులలో ఒకరిగా పరిగణించారు. *




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

కొంతమంది యాదవులు తమ స్వీకృతిని తెలుపుతూ తలలాడించారు. అక్రూరుడు మొదటిసారిగా కొంచెం స్వస్థత చెందాడు.

"అన్నగారూ! యాదవుల వద్ద ధనానికి ఏమీ కొరత లేదు. ఈ స్వర్ణముద్రలు కొంచెమే..."

"కొంచెమా? ఎన్నటికీ తరగని అనంత ధనరాసిని ఇచ్చే మణి ఈ శ్యమంతకం", అన్నాడు బలరాముడు విస్ఫారిత నేత్రాలతో.

"ఈ ముద్రలను లెక్కపెట్టగలం.... ధనాన్ని కొలిచి ఎంతో చెప్పగలం... అప్పుడు ఆ ధనం అపారం, అనంతం అని ఎలా అనటం? అనంతము, అపారము ఏదైనా ఉంటే అది యాదవులలో ఉన్న శ్రద్ధ, చెక్కుచెదరని విశ్వాసం. ఈ భావనను విడిచి కొన్ని ముద్రలను లెక్క పెడుతూ పోవటం బుద్ధిమంతులు చేసే పనికాదు", అన్నాడు కృష్ణుడు.

"కృష్ణా! ఈ శ్యమంతకం ద్వారా వచ్చే లక్ష్మి పరిశ్రమ విహీనమైనదని నువ్వే అన్నావుగా. అలా పరిశ్రమ లేకుండా వచ్చే లక్ష్మి వ్యక్తిగతం కాదు, సమిష్టికే చెందాలి", అన్నాడు బలరాముడు.

"సమిష్టి శ్రేయస్సు కోసం సత్యమే ఆధారం అన్నగారూ" కృష్ణుడు బలపరుస్తూ అన్నాడు, "కాని సమిష్టి శ్రేయస్సుకు అశ్రద్ధ పునాది కారాదు. ఈ మణి చరిత్ర మీరు మరిచారా?"

బలరాముడు అప్రతిభుడయ్యాడు. మణి చరిత్ర మాట చెప్పి కృష్ణుడు ఏమి సంకేతం చేస్తున్నాడు? తను ఈ మణి విషయంలో కృష్ణుని అపరాధిగా నిలబెట్టాడు!... కృష్ణుని చోరునిగా జమగట్టి అవమానించాడు.... యాదవులందరూ కృష్ణుని చోరునిగ శంకించారు... ఇదంతా ఈ మణి కారణంగానే జరిగింది!

"ఈ మణి అక్రూరునిది అన్నగారూ!... అక్రూరుడు ఛిన్నాభిన్నమైన నమ్మకాలను పునరుద్ధరించాడు. అది విలువ కట్టలేనిది. ఇలా అపూర్వ యోగదానం చేసిన అక్రూర మహాశయుని వద్ద ఈ మణి సురక్షితంగా ఉండటమే మనందరికి గౌరవదాయకం", దృఢ స్వరంతో అన్నాడు కృష్ణుడు.

బలరాముడు బదులు పలుకలేదు. మణి వల్ల కలవరపడిన యాదవుల మనస్సులు చింతాయుక్తమయ్యాయి.... ఒక ఉపద్రవ పరిస్థితి శాంతించింది... ఉత్తేజన పోయి శాంతి విలసిల్లింది.

అక్రూరునిపైన కృష్ణుడు చూపిన ఈ అనుగ్రహం కల్పనాతీతమైనది. బలరాముడు తీవ్ర ప్రతిక్రియ తెలిసిన తరువాత కూడా కృష్ణుడు ఈ విధంగా అనేసరికి అక్రూరుడు భావపరవశుడైనాడు. ఆయన సభలో సిగ్గుతో తల వాల్చేశాడు... సత్రాజిత్తు హత్యలో తన హస్తం ఉంది అని అందరూ ఇప్పుడు తెలుసుకున్నారు. కృష్ణుడు తనని రక్షించకపోతే యాదవులు అందరూ... ముఖ్యంగా బలరాముడు తన కుకర్మలకు ఏంచేసేవారో!...

ఆరోజు సాయంకాలం... కృష్ణుని ప్రాసాదంలో ఒక మూలగా... ఏకాంతంగా ఇద్దరు కూర్చుని ఉన్నారు.... కృష్ణుడు, అక్రూరుడు.

"కృష్ణా!" అక్రూరుని కంఠం రుద్ధమైంది. కనుల నిండా నీరు నిండింది. "నా అధర్మాన్ని మీరు ధర్మంగా ఎంచారు. మీరు చూపిన కృప శ్యమంతక మణికంటె వెయ్యి రెట్లు గొప్పది కేశవా!"

"అక్రూర మహాశయా", కృష్ణుడు అక్రూరుని కన్నీటిని తుడిచాడు. ఎవరి చేతిలో సుదర్శన చక్రం పుష్పం వలె తిరుగుతుందో ఆ చేతులు ఇంత మృదువుగా ఎలా ఉన్నాయి!... "అధర్మ ఆచరణ దేహం చేస్తుంది. ఎప్పుడైతే మనస్సు దేహానికి తన తప్పిదాన్ని తెలుపుతుందో ఆ క్షణం అది స్మరణీయము అవుతుంది అక్రూరా! మీకు అది సహజసిద్ధం.

"కృష్ణా.. కృష్ణా... నన్ను క్షమించు", అక్రూరుడు ఏడవసాగాడు. "మీరే నాతో చెప్పారు - విశ్వదేవునిలో లయమే అంతిమ లక్ష్యం అని. నన్ను కరుణించు కృష్ణా! జీవిత అంతిమ ఘడియలో ఇంకేదీ రాకుండా...ఆ విశ్వదేవ స్మరణే చివరదాక ఉండాలి. ఆ గమ్యం వైపు నన్ను తీసుకు వెళ్ళు".... కృష్ణుని కనులలో కరుణా సాగరము పెల్లుబికింది. నెమలి పింఛధారి యొక్క కరుణా సాగరంలో అక్రూరుడు పూర్తిగా పునీతుడైనాడు.... కృష్ణుడు అతనిని తన పరిష్వంగంలోకి తీసుకున్నాడు....

మరునాడు ప్రాతఃకాలం అక్రూరుని రథం మధురవైపు వెళ్తోంది. ఇక ద్వారకలోని యాదవులను కన్నెత్తి చూడలేడు. ఈ వీడ్కోలు సమయంలో రథాశ్వములు రేపే ధూళిలో దూరంనుంచి కృష్ణుడు కరుణార్ద్రమైన మందహాసం ఒలకబోస్తూ అతనినే చూస్తున్నాడని అక్రూరునికి తెలియదు.

అక్రూరుని ఉద్యానంలో ఇంకా తెల్లవారలేదు. ఉద్ధవునితో అక్రూరుడు గతించిన స్మృతుల నదీ ప్రవాహంలో మునకలు వేస్తూనే ఉన్నాడు! స్మృతులు

కూడా ఒక్కొక్కసారి అభిశాపం అవుతాయా, విస్మృతులు వరాలు అవుతాయా అనుకున్నాడు ఉద్ధవుడు. అక్రూరుడు ఇప్పుడు ఈ అభిశాపానికి గురి కాలేదు కదా....

"ఉద్ధవా", తమాలవృక్షాల నుంచి వచ్చే శీతల వాయువును చేతులతో తాకుతూ అక్రూరుడు ఇలా అన్నాడు, "ఈ పవిత్రమైన ప్రాతఃకాలంలో యమునా స్నానం చేసి ఒక యుగం గడిచింది! మట్టిలో కలవబోతున్న ఈ దేహం, ఈ వృద్ధావస్థ, ఈ ఆనందాన్ని అనుభవించలేదు! వత్సా! పద మనం ఈ కాళిందీ జలాలతో మన శరీరాలు పావనం చేసుకుందాం!"

"తండ్రీ", ఉద్ధవుడు సంశయిస్తూ, "ఇక ఈ దేహానికి కష్టం కలిగించవద్దు! ఈ సుఖం క్షణికం కాక శాశ్వతం కావాలి..."

ఉద్ధవుడు అక్రూరుని చేయి పట్టుకొన్నాడు... ఉద్ధవుని భుజంపై తన చేయివేసి బయటకు వచ్చాడు. ముఖద్వారంలో కావలి కాస్తున్న ప్రహరీలు ఈ ఇరువురూ కాళిందీ తటంవైపు వెళ్ళటం చూసి ఆశ్చర్యచకితులైనారు... ప్రాసాదంలో నిశ్శబ్దం అలముకున్నది...

ఇద్దరూ నెమ్మదిగా మధుర రాజమార్గం మీదుగా వెళ్తున్నారు. వారి పద చిహ్నాలు ధూళిలో పడుతున్నాయి.

"ఉద్ధవా", అన్నాడు ఉన్నట్లుండి అక్రూరుడు, "ఇప్పుడు ఈ ధూళిలో అంకితమైన మన పద చిహ్నాలను చూశావా నువ్వు? కృష్ణుని పదచిహ్నాలు కూడా ఈ ధూళిలో పడి ఉంటాయి కదూ". "అవును మహాశయా", అన్నాడు ఉద్ధవుడు. "ఇప్పుడు ఇక్కడ మన పదచిహ్నాలు కనిపిస్తున్నాయి. కొంచెం సేపు తరువాత వీటి మీద ఇతరుల పద చిహ్నాలు పడతాయి. భూమికి మానవుల, పశువుల భేదం ఎక్కడిది? అన్నిటినీ సమదృష్టితో తను భరిస్తుంది... ఈ భూమి మీద కృష్ణుని పద చిహ్నాలు ఎన్ని పడ్డాయో!" "మరి ఏ పద చిహ్నాలూ శాశ్వతం కాదు ఉద్ధవా!"

-సశేషం

---

## శ్రద్ధాంజలి

కందర్ప పరశురామయ్యగారి ద్వితీయ కుమార్తె కీ.శే మహాలక్ష్మమ్మగారి ప్రథమపుత్రుడు శ్రీ నేలభొట్ల శ్రీనివాసమూర్తిగారు ది.18.11.10 గురువారంనాడు గురుసాయుజ్యాన్ని పొందారు. వీరి వయస్సు 71 సంవత్సరములు. వీరి కుటుంబ సభ్యులకు శాంతి, స్థైర్యములను శ్రీ గురుదేవులు ప్రసాదించెదరు గాక.

---

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL